గ్రామరు నటి

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 29, 2015

యుగకవి



వర్ధంతి

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell : 9849970838

చాలా మిస్సవుతున్నా...

మిల్క్ బేబీ తమన్నా చిత్రసీమకొచ్చి అప్పుడే దశాబ్దం పూర్తయింది. సరిగ్గా 2005లో పదిహేనేళ్ల ప్రాయంలో బాలీవుడ్ చిత్రంలో అరంగేట్రం చేసినా తెలుగు, తమిళ చిత్రాల్లోనే పేరు సంపాదించుకుంది. తెలుగు, తమిళం చక్కగా మాట్లాడేసే ఈ ముంబై అమ్మడు ...తన సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి .... ఏం చెప్తోందో చూద్దాం.

- నేను పదవ తరగతి పరీక్షలు రాసిన వెంటనే తొలి సినిమా అవకాశం వచ్చింది. అప్పటికి దక్షిణాదిన సినిమాలు తీస్తారన్న విషయమే నాకు తెలియదు. హిందీ, ఇంగ్లీష్‌లలో మాత్రమే వుంటాయనుకునేదాన్ని. చాలా క్యాజువల్‌గా నటించడం ప్రారంభించాను. అలా 'హ్యాపీ డేస్, 100% లవ్, బాహుబలి...' చేస్తూ సినిమా ప్రేమలో పడిపోయాను. ఇతర వృత్తులలో నన్ను నేను ఊహించుకోలేనంటే నమ్మండి.
- నాకు మొదటి నుంచి డైలాగులు ఎక్కువగా వున్న సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ఎన్ని వాక్యాలను బట్టీపట్టానన్నదాని కంటే... నా ఉచ్చారణ ఎంత బాగా వుందనేదానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాను. రెండు భాషలు నేర్చుకోవడం సులభమని తెలుసుకున్నాను. ప్రస్తుతం నేను తెలుగు, తమిళం మాట్లాడగలను. మొదట్లోనే ఈ పని చేయడం నాకు చాలా ఉపకరించిందనుకోవాలి.
- కెరీర్‌లో ఉత్థానపతనాలు సహజం. అదో చక్రంలాంటిది. 'హిమ్మత్‌వాలా, హమ్‌షకల్స్' అంత బాగా ఆడకపోవడం నాకు బాధగానే అనిపించినా... అక్కడే ఆగిపోలా. సినిమాలు చేస్తూనే వున్నా. 'బాహుబలి' హిందీ వర్షన్‌కు నాకు నేనే డబ్బింగ్ చెప్పుకున్నా. ఉత్తరాది వాళ్లు నన్ను దక్షిణాది తార అనుకుంటారు. దక్షిణాదిన నన్ను బొంబే అమ్మాయి అనుకుంటారు. నేను అన్ని రకాల చిత్ర పరిశ్రమలకు చెందినదాన్నిగా వుండాలనుకున్నా...ఇదో రకమైన గుర్తింపు సంక్షోభం.
- ఇటీవల నేను బహుభాషా చిత్రాలు ఎక్కువగా చేస్తున్నాను. అవి మామూలు సినిమాలకంటే ఎక్కువ సమయం తీసుకుంటాయి. సినిమా పట్ల వల్లమాలిన ప్రేమ వున్నవారు తీస్తున్న 'బాహుబలి' వంటి చిత్రాల్లో చేస్తున్నాను. నాగార్జున, కార్తీ చేస్తున్న నా తదుపరి చిత్రం తోళ్లా (తెలుగులో ఊపిరి) అలాంటి ఓ సినిమా. వాణిజ్య సినిమాల్లో కూడా సాధ్యమైనంత మేరకు విభిన్నమైన పాత్రలే చేస్తుంటాను.
- సాధారణంగా... హీరోయిన్ జీవితం చాలా ఆకర్షణీయంగా వుంటుందనుకుంటారు. కానీ... ఏకాంతం, ఇష్టమైన ఆహారం, కుటుంబంతో సరదాగా గడపడం వంటివెన్నో కోల్పోతుంటాం. ఈ వృత్తితోపాటే ఇలాంటి సమస్యలన్నీ వస్తాయని నాకు తెలుసు. ఒక్కోసారి నా వయసులో వున్న వారిని చూస్తే ఈర్ష్యగా అనిపిస్తుంది. కానీ వాళ్లు కోరుకునే కొన్నిటిని నేను చేయగలిగాను. చూసేవారికి నేను జీవితంలో స్థిరపడినట్టే కనిపిస్తుంది. ★

15 ఏళ్ళు.. 11 సినిమాలు

అభిమానులు 'మేడీ' అని ముద్దుగా పిల్చుకునే మాధవన్ రాశి కంటే వాసికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తాడు. ఈ పదిహేనేళ్లల్లో తను చేసింది పదకొండు హిందీ సినిమాలేనంటే ఆశ్చర్యం వేస్తుంది. అయితేనేం... ఎప్పటికప్పుడు తనను తను అప్‌డేట్ చేసుకుంటూ ఏమాత్రం డిమాండ్ తగ్గకుండా చూసుకునే తెలివైన నటుడు. 2000 సంవత్సరంలో మణిరత్నం 'అలాయ్ పయుదే' చిత్రంతో సినీ రంగంలో అడుగెట్టాడు. సుభాష్ ఘై, కె. బాలచందర్ వంటి పెద్ద పెద్ద దర్శకులు బాలీవుడ్‌ను ఏలుతున్న కాలమది. దాంతో తనవైన చిత్రాలు రావడానికి కొత్త దర్శకుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. గౌతమ్ మీనన్ వంటి వారితో లవర్ బోయ్ పాత్రలు చేయనారంభించాడు. మల్టీస్టారర్ చిత్రాలు చేసినా తనదైన ముద్ర వుండేలా చూసుకుంటాడు మేడీ. పైగా ప్రతి రెండు సినిమాల మధ్య కొంత విరామం తీసుకుంటాడు. ఆ సమయంలో కొత్తగా ఏదో ఒకటి నేర్చుకోవడం అతని ప్రత్యేకత. పైగా ఎవరినీ తనకోసం ఒక పాత్ర ఇవ్వమని యాచించడు. వాళ్లు ఆ రోల్‌కు మేడీ సరిపోతాడు అనుకొని అడిగితేనే చేస్తాడు. అంతేకాదు. దర్శకుడి పనిలో వేలు పెట్టడు. ఏ పాత్రను ఎలా మలచాలన్నది దర్శకుడి విచక్షణకు విడిచిపెట్టడమే వివేకమంటాడు తెలివిగా. ★

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

సువిశాల నివాసాలు

◆ మనలో మాట

ఎక్కడి చైనా మంత్రిగారు! ఎక్కడి నవ్యాంధ్ర రాజధానిలోని రాయపూడి! కొన్ని వేల మైళ్ల దూరం వుంది మధ్యలో. అంత దూరం ప్రయాణించి వచ్చి మరీ అమరావతిని ప్రత్యేకంగా సందర్శించారు. అలా ఎందుకనిపించిందో ఏమో! అక్కడ ఒక చిన్ని పూరింటిని దర్శించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి లోపలికి అడుగెట్టిన చైనా మంత్రిగారికి చెప్పలేనంత హాశ్చర్యం. ఎన్ని కుశల ప్రశ్నలు కుమ్మరించారో! అంత చిన్న ఇంట్లో ఎంతమంది నివసిస్తారు? అందరికీ సరిపోతుందా? లేక సర్దుకుంటున్నారా? ఇల్లు ఎలా గడుస్తుంది? ఏం పని చేస్తారు? ఇలా సాగిందా ప్రశ్నల పరంపర. దానికా ఇంటివారు కూసింత బిడియంగా... బరువుగా... సర్దుకుంటున్నామని చెప్పారు. పాపం వాళ్లు మాత్రం అంతకంటే ఏం చెప్పుకుంటారు!

నిజానికి చైనా మంత్రిగారు చాలా మిస్సయిపోయారు. కొన్ని వేల మంది నివసించే సువిశాల, సుందర భవనాలను చూడలేకపోయారు. సువిశాల అనగానే... వందలాది గదులతో ... వేలాది పనివాళ్లు తీర్చిదిద్దే లోటస్ పాండ్లు, ఏంటీలియాలు... కాదు! అంత దూరం పోనవసరమే లేదు. జస్ట్ విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్, ప్రకాశం బ్యారేజీ చాలు! ఒక్క బెజవాడలోనే అనేముంది! రాష్ట్రంలో బ్రిడ్జిలు, ఫుట్‌పాత్‌లు, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లకేం కొదవ లేదుగా. కుప్పలు తెప్పలు. ఎంత సువిశాలంగా వుంటాయవి? వందల ఎకరాల్లో కట్టినవి. ఆకాశమే పైకప్పు. ఏసీలు, ఫ్రిజ్జులతో పనే లేదు. కరెంటు ఖర్చు ప్రసక్తే వుండదు. కావాల్సినంత గాలి, వెలుతురు, వాన. ఇష్టమొచ్చినంత జాగాలో ప్రశాంతంగా బతకొచ్చు. కాకపోతే కుక్కలు, పందులు, దోమలతో దోస్తీ.. పోలీసులతో కుస్తీ... ఎండ, వాన, చలితో మస్తీ... మామూలే. వీరి జీవితాల్లో ఎన్నేసి ఎంటర్‌టైన్‌మెంట్లో! ఎసైన్‌మెంట్లో! హాలీవుడ్ స్టార్లను మించిన ధైర్యసాహసాలు వీరి సొంతం. ఫుట్‌పాత్‌లు, బస్టాండుల్లో... మురికి, చిల్లుల దుప్పట్లలో మునగడ తీసుకొని పడుకున్న వీరి మీదికి చెప్పా పెట్టకుండా దూసుకొచ్చే వాహనాల నుంచి తప్పుకోవడం అంత చిన్న విషయం కాదు. జేమ్స్ బాండ్లు, సూపర్‌మేన్లు, హల్క్‌మేన్లు, బాండ్ లేడీసు మాదిరిగా రెప్పపాటులో ఆ మృత్యుశకటాల నుంచి తప్పుకోగలగాలి. లేనిపక్షంలో యముడితో భేటీ కావడానికి అప్పాయింటుమెంటు, నరకలోక ప్రయాణానికి టిక్కెట్టు బుక్ చేసుకోవాల్సి వస్తుంది. ఇవన్నీ మనకు బాగా సుపరిచితమైన సువిశాల గృహస్తుల బతుకులు.

వాటిని... చైనా మంత్రిగారికి చూపించి వుంటే ఎంత బావుండేదో!

■

టపా

ఎన్‌సైక్లోపేడియా

ఏసిడ్ దాడికి గురైన యువతులు నిర్వహిస్తున్న షీరోస్ కేఫ్ ద్వారా సమాజాన్ని తమ వైపు తిప్పుకున్న వారి ప్రయత్నం గొప్పది. రాయలు ఏలిన చంద్రగిరి చరిత్ర మ్యూజియం బాగా ఆకర్షించింది. వీధి కాల్వల్లో పేరుకుపోయిన మురుగును, మేన్‌హోల్‌ను తొలగిస్తున్న వారి పట్ల జాలి కురిపిస్తూ ప్రభుత్వ యంత్రాగాన్ని దుయ్యబట్టింది ఈ వారం కథ. మానవ మృగాల పైశాచికాన్ని కళ్లకు కట్టినట్టు మలిచిన లఘు చిత్రం 'అశ్విని' ఓ చక్కని ప్రయత్నం. కన్యాశుల్కంలో గురజాడ సృష్టించిన పాత్రల మనోభావాలకు అద్దం పట్టింది ఈ వారం అట్టమీదికథ. ముంబైని ఏలిన డాన్‌లు, చెరువుల్లోంచి ఏరుకొచ్చిన బంతులమ్మి ధనవంతుడైన గ్రైన్, అతి నిద్ర రోగంతో జోగుతున్న కజకిస్తాన్ గ్రామాలు వింతగొలిపాయి. స్నేహ ఒక ఎన్‌సైక్లోపేడియా.

టి.సత్యనారాయణ మూర్తి, మల్కాపురం, విశాఖ

సున్నిత పరిశీలన

గురజాడ అప్పారావు గారి మహిళల కథలు, గాథలను సున్నిత పరిశీలనతో రచించారు. నేటి సమాజంలోని స్త్రీలకు సంబంధించిన అంశాలను కళ్లకు కట్టినట్టు వివరించారు. పనికి రాని వస్తువులను అందమైన గార్డియన్‌గా తయారు చేశారు. ఏదైనా కళాత్మకంగా తీర్చిదిద్దితే అందమే.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, పూజారి పేట, ఆముదాల వలస

తప్పు చేస్తే దండనే

ముంబై అనగానే మాఫియా సామ్రాజ్యం...డాన్లు, వారి అసాంఘిక కార్యకలాపాలు, విలాసవంతమైన జీవితాలు గుర్తుకు వస్తాయి. చోటా రాజన్ వంటివారు పోలీసులకు చిక్కడంతో ఊసలు లెక్కబెట్టక తప్పడంలేదు. తప్పు చేస్తే దండన తప్పదనడానికి ఈ చిన్న ఉదాహరణ చాలు.

రాము, కడప (మెయిల్)

అది జబ్బే

స్ఫూర్తి కథనం నిజంగా స్ఫూర్తిదాయకంగా ఉంది. యాసిడ్ దాడులకు గురైన అమ్మాయిలు తమ జీవితాలు ఇంతటితో ముగిసిపోయాయి అని అనుకుంటున్న వారికి ఈ షీరోల కేఫ్ ఒక ఉత్సాహాన్ని, ప్రేరణను ఇస్తుందని ఆశిస్తున్నాను. ఇలాంటి వారిని సమాజం గుర్తించాలని కోరుకుంటున్నాను. ఈవారం కార్టూన్ పంచ్ బాగుంది. నిద్రలో రెండు గ్రామాలు చాలా విచిత్రంగా ఉంది. రెండు మూడు రోజుల అలాగే నిద్రపోవడం జబ్బే.

లక్ష్మణ్, విజయనగరం

మహిళ కీలకం

సమాజ గమనంలో కుటుంబ జీవనం సుఖంగా సాగాలంటే భార్యభర్తలు ఇద్దరు ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. వయస్సు మళ్లిన వారితో వివాహాలు, ఆస్తుల కోసం చెడు వ్యసనాలు ఉన్న వారితో వివాహాలు చేసుకున్న స్త్రీలు ఎదుర్కొంటున్న బాధలను గురజాడ చాలా లోతుగా అధ్యయనం చేశారు. నేటి సమాజంలో గురజాడ రచనలు జీవించే ఉన్నాయి. సమాజం మార్పుకు సాహిత్యం దిక్సూచిగా చైతన్యవంతంగా ఉండాలి.

తుంపాల శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖపట్నం.(మెయిల్)

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

యుగకవి 100 వర్థంతి

కవర్ స్టోరీ ——— 6

'తైలాలు లేకుండా వెలిగేటి దీపం, విద్యుత్ లేకుండా మెలిగేటి దీపం, మా మంచి దీపం, మా స్నేహ దీపం' అని చిన్నప్పుడు చదువుకున్న పద్యం గుర్తొస్తుంది గురజాడను తలచుకున్నప్పుడు. ఆ దీపం ఆరనిది. తెలుగు సాహిత్యాన్ని - సమాజాన్ని ఒక్కసారిగా చీకట్లోంచి వెలుగులోకి తీసుకొచ్చినవాడు గురజాడ అప్పారావు. ఆ వెలుగు సృష్టి ఉన్నంత వరకూ ఉంటుంది. గురజాడ సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు మనకి ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది.

స్ఫూర్తి 3
ఎదురులేని బౌన్సర్లు

అభిరుచి 4
వింటేజీ కళా'కార్'

కార్టూన్ పంచ్ 5

రుచి 10
సూప్..వేడి వేడిగా..

యువ 11
ఉత్తరానికి చిరునామా

సినిమా కబుర్లు 14
గ్రామరు నటి

వింత లోకం 16
అబ్బే..ఇదేం కేఫ్ !

చూద్దామా 17
పూమాల దీవులు

కథ 18
గమనం

బాల నేస్తాలు 22
పదేళ్ల పిల్లాడు 850 మంది ప్రాణాలు కాపాడాడు

కొత్త పుస్తకాలు 24
విభిన్న మనస్తత్వాల 'వెదురు పువ్వు'



ప్రత్యేకం -12
వృథా చేస్తే ఫైన్ వడ్డిస్తారు

ఎదురులేని బౌన్సర్లు

మెహ్రూన్ నిషా

ఏడేళ్ల క్రితం ఓ వార్త సంచలనం సృష్టించింది. అది భారత్‌లో తొలి మహిళా బౌన్సర్ గురించి. నైట్ లైఫ్ పిచ్చిలో ఉన్న మహానగరాల యువత అడ్డాల దగ్గర యువతుల భద్రత వీరి పని. ఇదేం ఉద్యోగం అంటూ కొందరంటే, మా దేశాల్లో పని కల్పిస్తామంటూ మహిళా బౌన్సర్లకు ఆఫర్లు దండెత్తాయి. ఇన్నేళ్లు గడిచాక వారి వార్తలు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. ఇప్పుడు చాలా అడ్డాల్లో 2 : 1 నిష్పత్తిలో వాళ్లు డేగ కళ్లతో యువతను హద్దుల్లో ఉంచుతున్నారు.

బౌన్సర్ల విధులు తెలిసినవే. ఎక్కడ ఏ సెలబ్రెటీ కార్యక్రమం ఉన్నా, బార్లలో, పబ్బుల్లో, యూత్ ఫెస్టివల్స్‌లో ఇలా గుంపులు పోగైతే అక్కడ భద్రతలో వీరి అవసరం చాలా ఉంటుంది. భారీ దేహాలతో, నల్లటి దుస్తుల్లో అంతెత్తున రొమ్ము విరుచుకుని నించునే వీరిని చూస్తే ఆకతాయిల చేష్టలకు ఆటోమేటిక్‌గా తాళం పడిపోతుంది. కానీ పురుష బౌన్సర్ల వల్ల మహిళలు ముఖ్యంగా యువతులు ఇబ్బందులు పడిన సందర్భాలు వెలుగులోకి వస్తున్నాయి. కంచె చేను మేసినట్టు మత్తులో ఉన్న మహిళలపై వేధింపుల వార్తలు వినిపిస్తూనే

ఉన్నాయి. దీనికి పరిష్కారంగా మహిళా బౌన్సర్లు తెరపైకి వచ్చారు. తొలుత ఎక్కడో అడపాదడపా కనిపించిన వీరు ఇప్పుడు ప్రతిచోట దృఢంగా కనిపిస్తున్నారు. పబ్బుల్లో మహిళల రెస్ట్‌రూముల్లో డ్రగ్స్ తీసుకోవడం, ఆకతాయిల అల్లరి, పార్టీ తర్వాత ఇంటికి తీసుకెళ్లే వాళ్లు లేక ఇబ్బందుల్లో పడటం, మైకం ఎక్కువై వాళ్లకు వాళ్లే తన్నుకోవడం మహానగరాల పబ్బుల్లో తరచూ జరిగేదే. వీటిని అదుపులో ఉంచేందుకు మహిళా బౌన్సర్ల సేవలు బాగా ఉపయోగపడుతున్నాయి.

బాలీవుడ్ స్టార్లకు భద్రతగా...

బాలీవుడ్ సెలబ్రెటీల కార్యక్రమాల్లోను వీరి లేనిదే అడుగు ముందుకు పడటం లేదు. వీరి పర్యవేక్షణ ఉండటంతో ఏ ఇబ్బంది లేకుండా పార్టీల్ని ఆస్వాదిస్తున్నారు యువత. 2008లో తొలిసారిగా చండీగఢ్‌లోని ఓ పబ్ అమర్‌దీప్ కౌర్ అనే యువతిని బౌన్సర్‌గా తీసుకుంది. ఈ వార్త పెద్ద సంచలనమై మీడియాకెక్కడంతో విదేశీ ఆఫర్లు కూడా ఆమెకు ఇబ్బడి ముబ్బడిగా వచ్చాయి. ఆ తర్వాత క్రమంగా మహిళా బౌన్సర్ల సంఖ్య పుంజుకుని ఢిల్లీ, బెంగళూర్, ముంబై వంటి మహానగరాలన్నింటా విస్తరించారు. వీరిలో చాలా మంది తల్లులు ఉండటం గమనార్హం. గీతా లాహ్‌రోయ్ ఆ కోవకు చెందినవారే. ఇద్దరు టీనేజీ ఆడపిల్లల ఉన్న 35 ఏళ్ల లాహ్‌రోయ్ ఐదేళ్లుగా ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. భర్త, కొడుకు చనిపోవడంతో కుటుంబ భారమంతా ఆమెపై పడింది. ఈ వృత్తి తన కూతుళ్ల లాంటి సాటి ఆడపిల్లల భద్రతకు సంబంధించింది కావడంతో ఎంతో ఇష్టంతో పనిచేస్తోంది. పురుష బౌన్సర్లని ఇరుకున పెట్టే సందర్భాల్లో ఆమె ధైర్యంగా సమాధానం చెప్పింది. ఢిల్లీలో బౌన్సర్లుగా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ షహరాన్‌పూర్‌కు చెందిన ఇద్దరు అక్కచెల్లెల్లు కూడా ఈ వృత్తి ద్వారా జీవితాలు మార్చుకున్నారు. 28 ఏళ్ల మెహ్రూన్ నిషా, ఆమె చెల్లెలు తారన్నుం షౌకత్ అలీ ఇద్దరూ బౌన్సర్లుగా పనిచేస్తున్నారు. షారుక్ ఖాన్, అమీర్ ఖాన్, అక్షయ్ కుమార్, దీపికా పదుకొనే, విద్యాబాలన్‌ల ఎన్నో కార్యక్రమాలకు వీరు సేవలు అందించారు. పోలీస్ కావాలనుకున్న ఎం.ఏ గ్రాడ్యుయేట్ అయిన మెహ్రూన్ ఎన్‌సీసీ శిక్షణ తీసుకుంది. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో తొలుత ఓ సేల్స్ గర్ల్‌గా చేసింది. ఓ ఎన్‌జీవో ద్వారా మహిళా బౌన్సర్ ఉద్యోగం గురించి తెలుసుకుంది. తొలుత జమిలియా మిల్లియా ఇస్లామియా భద్రతకు పనిచేసిన ఆమె ఆ తర్వాత ఢిల్లీలోని పాపులర్ హ్యాంగౌట్‌లో విధులు నిర్వహిస్తోంది. కరాటే వచ్చిన ఆమెను చూస్తే ఆకతాయిల గుండెలు అదిరిపోతాయి. ఏ గొడవా చేయకుండా బుద్ధిగా మెసులుతారు. తారాన్నుమ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ సాయంత్రాలు బౌన్సర్ అవతారమెత్తుతుంది. ఐపీఎల్, ఆడిషన్స్, చిత్ర ప్రమోషన్స్, కార్పొరేట్ లాంఛ్‌ల భద్రతా విధుల్లో పనిచేసింది. అయితే అర్ధరాత్రుళ్లు తర్వాత ఇళ్లకు చేరుకోవడం వల్ల తొలుత ఈ అక్కచెల్లెళ్ల గురించి చుట్టుపక్కల వారు తప్పుగా మాట్లాడేవారు. ఇంటి యజమాని వీరి ఉద్యోగాల తీరు వివరించి వాళ్ల నోళ్లు మూయించాడు. ఇంటి బాధ్యతల్ని భుజాన మోస్తున్న వారిని చూసి నీలాంటి కూతురు ప్రతి ఇంట ఉండాలని వారే ఆ తర్వాత మెచ్చుకున్నారు. ముంబైకి చెందిన సునీతది మరో కథ చిన్న వయసులోనే భర్త మరణించడం పిల్లల బాధ్యతలు మీద పడటంతో బౌన్సర్‌గా మారింది.

తక్కువ పనివేళలు ఉండటంతో ఆమె చిన్నారుల్ని చూసుకోవడం తేలికైంది. రోజు 5 గంటలపాటే షిఫ్ట్ ఉండటం పురుష బౌన్సర్ల కన్నా జీతాలు ఎక్కువ ఉండటంతో ఎక్కువ మంది మహిళలు ఈ వృత్తిలోకి ఆకర్షితులవుతున్నారు. తమ దేహదారుఢ్యాన్ని, మానసిక స్థైర్యాన్ని ఉద్యోగ అవకాశంగా మలుచుకోగలుగుతున్నారు. వృత్తిలో కొన్ని ఇబ్బందికర పరిస్థితులు అప్పుడప్పుడు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని కొనసాగుతున్నారు. మహిళలు దీనికే పరిమితం, ఈ వృత్తులు వారికి అనుకూలం కావు అనే వారి బుర్రతీరు మార్చుకోవాలని అంటున్నారీ బౌన్సర్లు. వీరిలో చాలామంది జీవితాల్లో చాలా బౌన్సల్ని చూసినవాళ్లే. వాటి ముందు ఈ వృత్తిలో ఎదురయ్యే సవాళ్లు ఓ లెక్కా అనిపిస్తుంది. ✦



వింటేజీ కళా'కార్'

కారంటే ఇష్టముండటం వేరు. వింటేజీ కార్లను ప్రేమించడం వేరు. చాలామంది వందేళ్లనాటి కారును ఓసారి ముట్టుకున్నా చాలని సంతృప్తి పడేందుకు సిద్ధమవుతారు. ధర్మస్థలానికి చెందిన డి. వీరేంద్ర హెగ్డే అలా కాదు. ఏకంగా వాటితో ఓ మ్యూజియాన్నే ఏర్పాటు చేసేశాడు. కేవలం మనదేశంలో తిరిగిన కార్లే కాదు విదేశాల్లోను రారాజులను తిప్పిన ఆ కార్లు ఇప్పటికీ రయ్యిన దూసుకుపోయేలా చేయడం గొప్పే.

ఎంత మాడ్రన్ కార్ల మధ్యలోనైనా ఓ వింటేజీ కారును పెడితే ఆ క్లాసిక్ కళే వేరు. కార్లను తొలిసారి రోడ్లు ఎక్కించినపుడు వాటి సంఖ్య చాలా పరిమితం. ఒక్కో కారును పదుల మంది నిపుణులు అణువణువూ ఎంతో జాగ్రత్తగా అమరుస్తూ ఓ కళాఖండంగా తీర్చిదిద్దేవారు. కారు చక్రం నుంచి బాడీ వరకూ ఎంతో సృజనాత్మకంగా నగిషీ పెట్టేవాళ్లు. వీటిని మహారాజులు, చక్రవర్తులు, వ్యాపార దిగ్గజాలు ఎంతో మనసుపడి తయారుచేయించుకునేవారు. అలాంటి వాటినే వింటేజీ కార్లంటారు. ఠీవిగా కనిపించే వీటిలో నాయకులు తిరగడానికి ఎంతో ఇష్టపడేవారు. 70ల వరకు అడపాదడపా కనిపించిన అవి మొత్తానికి రోడ్ల మీద నుంచి తప్పుకున్నాయి. వీటిని చూడాలంటే అదృష్టం కావాలని అనుకుంటారు వాటిని పిచ్చిపిచ్చిగా ఇష్టపడే అభిమానులు. ఎవరో ప్రైవేట్‌గా వారి వద్దనుంచుకున్నా పబ్లిక్ చూడటానికి మాత్రం అవకాశం ఉండదు. ఈ అవకాశాన్నే కల్పిస్తున్నాడు వీరేంద్ర హెగ్డే. ధర్మస్థలంలోని ఆలయానికి పెద్దగా వ్యవహరించే ఆయన మంజూష మ్యూజియాన్ని ఏర్పాటు చేసి ఈ వింటేజీ కార్లను చూసే అవకాశం కల్పిస్తున్నాడు. 'కార్లంటే ఏవో మర యంత్రాలు కావు. వాటినీ గుర్రాల్లా మనసుకు దగ్గరగా చూడాలి' అని తల్లిదండ్రులు చెప్పిన మాట బలంగా నాటుకుపోయింది హెగ్డేకు. అప్పటి నుంచి తన స్టాండర్డ్ హెరాల్డ్ కారును సొంత బిడ్డలా చూసుకుంటూ ఎప్పటికప్పుడు బెంగళూరులోని ఆల్విన్ మరకాడ అనే మంచి మెకానిక్‌కు దగ్గర సర్వీసింగ్ చేయించేవాడు.

తొలి కారు చేరిందలా

అప్పటికి ఆయనకు కార్ల మ్యూజియం ఆలోచన కలలో కూడా రాలేదు. అయితే ఎప్పుడు వెళ్లినా కార్లను తాను ఎంతగా అభిమానించేది, వాటి విశేషాల గురించి ఆల్విన్‌తో ఇష్టంగా ముచ్చటించేవాడు. హెగ్డేకు ఉన్న కార్ల ప్రేమ గురించి అర్థమైన ఆల్విన్ తన గ్యారేజీలో బాగుచేసిన 1951 నాటి జర్మన్ డైమ్లర్ బెంజ్ కారును చూపించాడు. చూసిన వెంటనే దానికి ఆకర్షితుడైపోయిన హెగ్డే ఎట్టి పరిస్థితుల్లోను దాన్ని సొంతం చేసుకోవాలనుకున్నాడు సాధించాడు. అలా తన వద్ద తొలి వింటేజీ కారు జమ అయిపోయింది. దాన్ని గుడికి వచ్చే భక్తులు గొప్పగా చూస్తుండటంతో దాన్ని ప్రదర్శనకు ఉంచేవాడు. భక్తుల్లో ఒకరు మరో వింటేజీ కారును బహుమతిగా ఇవ్వడంతో మరో కారు తోడైంది. ఆ తర్వాత దాన్నే వ్యాపకంగా చేసుకున్నాడు. పైగా, వాడని కార్ల గురించి వాకబు చేసి సొంత గ్యారేజీని ఏర్పాటుచేసి వాటిలో తిరిగి ప్రాణం పోయడం ప్రారంభించాడు. ఎంతో సుశిక్షితులైన మెకానిక్‌లను ఏరికోరి తెప్పించుకుని కార్లను తిరిగి రోడ్లను ఎక్కించే పనిని బాధ్యతగా భావించాడు. తన మ్యూజియంలో వింటేజీ కార్ల సంఖ్య 80కు చేరిపోయింది. దేశవిదేశాలన్నింటినీ జల్లెడ పట్టి స్పేర్ పార్ట్‌లను భారీగా నిల్వ ఉంచడంతో అవి కేవలం ప్రదర్శనలకే పరిమితం కాక వీధుల్లో తిరుగుతూ సందడి చేస్తున్నాయి. కొన్ని కార్లకు ఏళ్ల తరబడి కష్టించి మెకానిక్‌లు ఊపిరిలూదేవారు. 1947 నాటి హడ్సన్‌ను ఇంజిన్‌లో చలనం తెప్పించేందుకు ఏడాది పట్టింది. అతి శీతలంగా ఉండే అక్కడి ప్రాంతానికి, దుమ్ముకు కార్లు పాడవకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. గ్యారేజీ బాధ్యతలతో పాటు మ్యూజియంలోని కార్లను దివాకర్ ప్రభు అనే మెకానిక్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటాడు. గ్యారేజీలో మరమ్మతు చేయాల్సిన వింటేజీ కార్లు ఇప్పటికే ఓ యాభై వరకు ఉన్నాయి. హెగ్డే ఉన్న కార్లన్నిటిలో ఆయన ఫేవరెట్ రాయల్ డైమ్లర్ డబుల్-6. 1949 నాటి ఈ కారును క్వీన్ ఎలిజబెత్ కోసం సిద్ధం చేశారు. దానిలో ప్రయాణించే ఆమె 1957లో ఆస్ట్రేలియా పర్యటన సాగించింది. ఆస్ట్రేలియాపై రాణి అధికార స్వీకారానికి వెళ్లిన సందర్భమది. ఆ తర్వాత దీన్ని మైసూర్ మహారాజు ద్వారా హెగ్డే సొంతం చేసుకున్నాడు. 2012లో ఆక్టేన్ అవార్డు తీసుకోవడానికి వెళ్లిన హెగ్డే ఇంగ్లండ్ వెళ్లినపుడు ఇదే విషయాన్ని ప్రిన్స్ చార్లెస్ నవ్వుతూ అడిగారట. 1929లో గాంధీ పర్యటనలకు వాడిన స్టడ్‌బక్కర్ కూడా ఆయన దగ్గర ఉంది. సీవీ రామన్ ఉపయోగించిన అదే మోడల్ కూడా ఉంది. అన్నింటికన్నా పాతకాలం నాటి రెనాల్ట్ కారు కూడా ఉంది. ఇది 1903 నాటికి చెందిన కిరోసిన్ లాంతర్లు కలిగిన కారు. ఇదో ప్రత్యేకం. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా వాడిన వోక్స్‌వ్యాగన్ బీటిల్ శ్రేణికి చెందిన నాష్ కూడా ఉంది. కొల్హాపూర్ మహారాజుకు చెందిన 1935 నాటి సన్‌బీమ్, పుర్ణియా మహారాజుకు చెందిన 1937 నాటి బ్యూక్ స్పెషల్, జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, సోవియట్ ప్రీమియర్ నికోలాయ్ పర్యటించిన 1954 నాటి డాడ్జ్ కింగ్స్‌వే కూడా సేకరించడం హెగ్డే వింటేజీ కార్ల సేకరణనేది వ్యాపకం స్థాయిని దాటి అదో జీవిత లక్ష్యమైంది.

ఈ అరుదైన, అపురూపమైన కార్లలో 1937కు చెందిన పాపులర్ ట్యాక్సీ కారు స్కోడా రోడ్‌స్టర్‌తో పాటు 40ల నాటి మోరిస్ ఆక్స్‌ఫర్డ్, 1946 నాటి ప్యాకర్డ్, 47 నాటి ఫ్రేజర్‌తో పాటు ఎన్నో కార్లు పాత రోజుల్ని కళ్లెదుట నిలుపుతాయి. వాటి దర్పం, ఠీవితో మ్యూజియం వాతావరణాన్ని క్లాసిక్ అనుభూతుల్ని మిగిల్చే టైమ్ మెషీన్‌లా మార్చేస్తాయి.

ఉగ్రవాదం వేరు మతం వేరు నాయనా!!
గంగాధర్


ఉండటానికీ... ఊర్లు తిరగడానికీ... బావుంటుందని!!

ప్రత్యేక హోదా డిమాండ్
ఈసారి గట్టిగా పోరాడుతాం!!
YSRCP

కార్టూన్ పంచ్


ప్రతిపక్షాలకు ఛాన్స్ ఇవ్వడం ఎందుకు.. అదేదో మనమే... అనేసుకుందాం!!
ప్రజలు అసంతృప్తితో ఉన్నారు



'తైలాలు లేకుండా వెలిగేటి దీపం, విద్యుత్ లేకుండా మెలిగేటి దీపం, మా మంచి దీపం, మా స్నేహ దీపం' అని చిన్నప్పుడు చదువుకున్న పద్యం గుర్తొస్తుంది గురజాడను తలచుకున్నప్పుడు. ఆ దీపం ఆరనిది. తెలుగు సాహిత్యాన్ని - సమాజాన్ని ఒక్కసారిగా చీకట్లోంచి వెలుగులోకి తీసుకొచ్చినవాడు గురజాడ అప్పారావు. ఆ వెలుగు సృష్టి ఉన్నంత వరకూ ఉంటుంది. గురజాడ సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు మనకి ఈ విషయం స్పష్టంగా బోధపడుతుంది.

యుగకవి 100 వర్థంతి

- నండూరి రాజగోపాల్

98481 32208

1862లో గురజాడ జన్మించినా, 1892లో గురజాడ తొలిసారిగా రాసిన 'కన్యాశుల్కం' నాటకానికి ముందున్నదంతా కూడా గురజాడ ముందున్న సాహిత్యంగానూ, సమాజంగాను అనుకోవచ్చు. ఆ విధంగా చూసినపుడు ప్రజల నుండి దూరమైన కృతక భాషలో సాహిత్యం, మూఢనమ్మకాలు, మతపరమైన దుష్ట సంప్రదాయాలు, దిగజారుడుతనంతో కూడిన తిరోగమన ధోరణులతో 1892 పూర్వం కల్లోల క్షీణదశ అటు సాహిత్యంలోను, ఇటు సమాజంలోనూ నడిచింది. మానవ జీవితాన్ని అందునా స్త్రీల జీవితాలకి కనీస రక్షణగాని, గౌరవం గాని, సాటిమనిషి అనే వివేకం కాని, మగవాళ్ళలాగే వాళ్లకి ఓ హృదయం ఉంటుందన్న ఆలోచన గాని లేని కాలంలో డబ్బుకోసం, హోదా కోసం, సంఘంలో పరపతి కోసం కాటికి కాలుజాపిన సంపన్న వృద్ధులకు ముక్కుపచ్చలారని అమ్మాయిలనిచ్చి పెళ్ళి చేసే నీచ సంప్రదాయం అడుగడుగునా ఆనాటి సమాజాన్ని వెలుతురికి దూరం చేసింది.

ఆధునిక దృక్పథానికి నాంది

అందుకే గురజాడ 'కన్యాశుల్కం' నాటకం ప్రథమాంకం గిరీశం స్వగతంతో 'సాయంకాలమైంది....' అంటూ ప్రారంభమవుతుంది. ఈ ప్రారంభమే గురజాడ ఆధునిక దృక్పథానికి నాందీ వాచకం. మామూలుగా ఒక వాక్యంగానో లేదా సాధారణ మాటగానో ఈ పదాన్ని గురజాడ ఉపయోగించలేదు. కల్లోల క్షీణదశ అంతమయ్యే సమయం ఆసన్నమైందని చెప్పే ఒక ఆశను రేకెత్తించడానికి 'సాయంకాలమైందం'టూ ఈ నాటకాన్ని ప్రారంభిస్తాడు. సాయంత్రం తర్వాత చీకటే. దేనికి చీకటి ? అంతకు ముందు వరకు ఏ పురాతన సంప్రదాయాలైతే ఉన్నాయో... ఏ మూఢ ఆచారాలైతే ఉన్నాయో అవి ఒక్కసారిగా అంతమైపోతూ జారిపోయే అంధకారం లాంటి చీకటి లోయ అది. అలా జారిపోవడానికి కావలసిన సాధన సంపత్తిని తయారు చేసుకుని ముందుకు సాగిన వాడు గురజాడ. గురజాడ పుట్టిన 1860వ దశకం ప్రపంచంలోనే భారతదేశ పతాకాన్ని గర్వంగా నిలబెట్టిన ప్రత్యేకతలను పొదుగుకున్నది. విశ్వకవి రవీంద్రుడు, మహాకవి సుబ్రహ్మణ్యభారతి, విశ్వమత ప్రవర్తకులు వివేకానందులు, మహాద్రష్ట చిలకమర్తి ప్రభృతులు ఆ దశకంలోనే జన్మించి సాహిత్య, సామాజిక, ఆధ్యాత్మిక జీవితాలలో విప్లవ చైతన్యాన్ని తీసుకొచ్చారు.

ఆ ప్రత్యేకత పుణికి పుచ్చుకున్నాడో ఏమో గురజాడ సృష్టించిన సాహిత్యం అంతా ఆనాటి సమాజాన్ని ప్రక్షాళన చేసే ఒక ప్యూరిఫికేషన్ ఔషధంలా ఉపయోగపడింది. 19వ శతాబ్దం ఉత్తరార్థంలోనే రాబోయే భవిష్యత్‌ను నిర్ణయించగలిగి, నిర్దేశించే శక్తిని సంపాదించుకున్న గురజాడను ఇవాళ పునర్మూల్యాంకనం చేసుకోవడానికి ఆయన సాహిత్యమే ఒక వాహిక. ఈ వాహికను ఐదు విభాగాలుగా విభజించినపుడు, ఈ ఐదు విభాగాల ద్వారా గురజాడ ఎందుకు చరితార్థుడు అయ్యాడో, 'చిరంజీవి'గా మిగిలాడో మనకి అర్థమవుతుంది. ఆ ఐదు విభాగాలు 1. సంఘ సంస్కరణల వైఫల్యాన్ని ఎత్తి చూపడం 2. మానవజన్మల జీవజాడ అయిన స్త్రీని గుర్తించడం.



3. ఆధునిక మానవ జీవిత క్లేశాలని ఒడిసి పట్టడం 4. భ్రష్టు పట్టిన విద్యావ్యవస్థను నిలదీయడం. 5. సాహిత్యాన్ని సామాజిక బాధ్యతగా మార్చడం. ఈ ఐదు లక్షణాల వలన గురజాడ జీవితం, సాహిత్యం 19వ శతాబ్దం తర్వాత తెలుగు సాహిత్యానికి, సమాజానికి దిక్సూచిగా మారాయి.

సంస్కరణకే తొలి ప్రాధాన్యత

గురజాడ కంటే ముందు కందుకూరి సంఘసంస్కరణ ఆవశ్యకతను గుర్తెరిగినవాడు. అనేక వ్యయ ప్రయాసల కోర్చి సంఘ సంస్కరణోద్యమాన్ని స్వయంగా ముందుకు తీసికెళ్ళినాడు. అనేక వితంతు వివాహాలని, హేతువాద భావజాలంతో కూడిన ఉద్యమాలని నడిపించినవాడు. అందుకే కందుకూరి తాను సృజన చేసిన సాహిత్యకం కన్నా, సంస్కరణకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. అయితే తర్వాత వచ్చిన గురజాడ మాత్రం గుడ్డిగా ఈ మార్గాన్ని స్వీకరించలేకపోయాడు. తను రచన చేసే కాలం నాటి సమాజంలో అల్లుకుపోయిన వేదనామయ జీవితాల మూలాలను కనిపెట్టి, వాటి నాశనానికై నడుం బిగించాడు. ఇక్కడే గురజాడ ప్రత్యేకత మనకు కనపడుతుంది. స్వేచ్ఛను కోల్పోయి, ప్రగతి రహిత జీవితాల నుండి స్వేచ్ఛవైపు, వెలుగువైపు, అభివృద్ధి వైపు నడుద్దామనుకున్నా లేదా నడిపిద్దామనుకున్నా కేవలం ఉపరితల ప్రక్షాళన మాత్రమే సరిపోదు. మూలాలను కదిలించాలి. గురజాడ చేసింది అదే.

కన్యాశుల్కం నాటకాన్ని చూసినపుడు మనం ఊహించినట్టు అందులో ఎక్కడా వితంతు వివాహం జరగదు. అలాగే వేశ్యలకు పెళ్ళి చేసి వాళ్లని సంస్కరించే కుహనా సంస్కర్త వేషమూ అందులో మనకి కనపడదు. అటువంటప్పుడు వితంతు వివాహాలకి, వేశ్యా వివాహాలకి గురజాడ వ్యతిరేకా అంటే ఎంతమాత్రమూ కాదు. అయితే సంస్కరణల ఉద్యమాల పట్ల, ఆంటినాచ్ ఉద్యమాల పట్ల గురజాడకు ఉన్న అసహనం, అపనమ్మకమే కన్యాశుల్కం నాటకంలో అలా అసంపూర్తిగా వదిలేసిన ప్రయత్నానికి, 'సంస్కర్త హృదయం'లో సరళ ద్వారా ప్రొఫెసర్ అవివేకాన్ని వేలెత్తి చూపడానికి కారణం. ఎందుకంటే ఈ సంస్కరణలలో ఎన్ని వేశ్య వివాహాలు చేశాము, ఎన్ని వితంతు వివాహాలు చేశాము అన్నదే ఉద్యమకారులు గమనిస్తారు కాని, వివాహం అయిన తర్వాత ఆ స్త్రీల పరిస్థితి ఏమిటి? అన్నది గమనించరు. 'ఏదో ఒక చండాలుడికి నేను కలకాలం పూర్తిగా బానిసనై పడి ఉండాలనా మీ తాత్పర్యం!' అని సరళ అన్నది అందుకే. ఇక్కడ గురజాడ ఆలోచన ప్రకారం స్త్రీ పురుషుల మధ్య వివాహానికి గాని, సహజీవనానికి కాని పునాది 'పరస్పర ప్రేమ' అయి ఉండాలి. కానీ పేరు ప్రఖ్యాతలో, డబ్బో, తాత్కాలిక ఆవేశమో కాకూడదు. ఈ కుహనా సంస్కరణలు అప్పుడు మాత్రమే కాదు ఇప్పుడూ ఉన్నాయి. సామూహిక కంటి ఆపరేషన్లు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, దంత పరీక్షలు వంటివి సంఖ్యను చూపెట్టుకోవడానికే తప్ప నాణ్యమైన సేవలందించడానికి గాదు. దాదాపు పదకొండు దశాబ్దాలు గడిచినా ఈ కుహనా సంస్కరణలు తీరు మారలేదు.

స్త్రీ ఉనికికి శాశ్వత స్థానం

'ఊయల ఊపే హస్తాలే ప్రపంచాన్ని పరిపాలిస్తాయి' అన్న డబ్ల్యు.ఎస్.రాస్‌కు ముందే గురజాడ 'ఆధునిక మహిళలు చరిత్రను తిరగ రాస్తారు' అని మానవ జన్మకు జీవజాడ అయిన స్త్రీకి ప్రాధాన్యత ఇచ్చి, ఆమె విలువని, ఆమె ఉనికిని శాశ్వతం చేస్తాడు. మధురవాణి, కమలిని, పూర్ణమ్మ, కన్యక, నాంచారమ్మ, మెటిల్డా.... ఇలా గురజాడ స్త్రీ పాత్రలందరూ 'బెదరు ఎరుగని బింక మొప్పిన నడకతో' భావితరాల స్త్రీలకు మార్గదర్శకత్వం వహించిన వారే. గురజాడ స్త్రీ పాత్రలు అబలలు కారు. సమస్యకు జారిపోయి మూగగా రోదించేవారు కాదు. పరిష్కారం కోసం ద్రౌపదిలా ఎవరి కోసమో ఎదురు చూసేవారు కాదు. తమ సమస్యలను తామే పరిష్కరించుకునే ధీరత్వం ఉన్నవారు. తామున్న పరిస్థితులకు అనుగుణంగా తమకి తాము రక్షణ ఏర్పాటు చేసుకోగలిగేవారు. ఒక వేశ్య అయినా, చదువుకోని అగ్రహారపు స్త్రీ అయినా, ఒక భోగం పడుచు అయినా మానవత్వంతో మెరిసిపోయేవారు. ఇతరుల పట్ల ప్రేమని, బాధ్యతను గుర్తెరిగి ప్రవర్తించేవారు, అందుకే వేశ్య చేయి నా శరీరంలో ఏ భాగంలో తగిలినా దానిని కోసుకుంటాను అనే వీర ఛాందసుడైన సౌజన్యారావు పంతులుని ఆ వేశ్యకే సంతోషంగా షేక్‌హేండ్ ఇచ్చే స్థాయికి చేర్చిన నేర్పు మనం మధురవాణిలో చూస్తాం. ఇది మనకి టాగూర్ నాటకం 'చిత్ర'ను గుర్తుకు తెస్తుంది i am arjuna,middle of pandavas అన్న అహంకారం నుండి i am arjuna,love hungered guest at your door step అనిపించగలిగిన చిత్రాంగధ గుర్తొస్తుంది. టాగూర్‌తో గురజాడకు గల పరిచయమూ, ప్రేరణ మనకు తెలిసిందే. మనిషి మనిషికి మధ్య అడ్డుగోడల్ని కూల్చి స్నేహభావం పెంచుకోవాలనే సందేశాన్ని కూడా మనం ఇందులో చూస్తాం. అంతేకాదు 'చెడని వారిని చెడగొట్టొద్దని మా తల్లి చెప్పింది' అంటూ సౌజన్యారావు పంతులుని దూరంగా ఉంచుతుంది మధురవాణి. 'మధురవాణి రాజుల రాణి' అన్నది ఇందుకే. ఒక్క మధురవాణే కాదు, గురజాడ స్త్రీ పాత్రలందరూ కూడా వ్యక్తిత్వమూ, మానవత్వం ఉన్నవాళ్ళే. ఆ తర్వాత మనకు చలం నాటికలలో ముఖ్యంగా 'సత్యం'లోను, ఆయన కథలలోను, డా॥పి.శ్రీదేవి 'కాలాతీత వ్యక్తులు'లో ఇందిరగా, బుచ్చిబాబు 'చివరకు మిగిలేది'లో అమృతంగా ఇలా అనేక రూపాలుగా మనకి గురజాడ ప్రభావం కనపడుతుంది. స్త్రీవాద సాహిత్యానికి చాలా సంవత్సరాలు ముందుగానే నిర్మాణాత్మక వ్యక్తిత్వంతో స్త్రీ పాత్రలను దిద్దినవాడు గురజాడ.

జీవన క్లేశాలపై పట్టు

గురజాడను ఎప్పటికీ సజీవంగా ఉంచే మూడో కారణం జీవన క్లేశాలను ఒడిసి పట్టుకోవడం. కన్యాశుల్కం దగ్గర్నించి ముత్యాల సరాలు దాకా ఆయన చేసిన ప్రతి సృజనలోను మానవ జీవితంలో దాగున్న అనేక సంఘర్షణలు, బాధలు, పొట్ట నింపటం కొరకు పడే వేదనలు, వ్యక్తిగత బలహీనతలు, అనవసర ఆర్భాటాలు

గురజాడ ఇల్లు

వంటివి ఎన్నో కనపడతాయి. ఇవి ఎవర్‌గ్రీన్ అంటామే అలాగే ఇప్పటికీ మానవ జీవనాన్ని పీడిస్తున్నాయి. 'పెరిగి విరిగితి / విరిగి పెరిగితి/ కష్ట సుఖముల / సార మెరిగితి. కొత్తమిన్కుల / తెలివితేటల / మంచి చెడ్డల / మార్సితిన్' అని స్వయంగా చెప్పుకున్నట్టుగానే సమాజంలో పాతుకుపోయిన అనేక ఆచారాలను, వాటి మూలాలను ప్రశ్నించి, కదిలించి, మార్చించినవాడు గురజాడ. 'నా ఉద్యమం ప్రజల ఉద్యమం' అని చెప్పుకున్న ఆయన ఏ దశలోనూ దీనిని ఆపేది లేదని కూడా చెప్పుకున్నారు. పరాయి స్త్రీ వైపు ఆకర్షితుడయ్యే గోపాలరావు, భార్యని తన మిత్రులకు ఎర చూపే వృద్ధ భర్తలు, పొట్ట పోసుకోవడం కోసం అనేక కథలు వినిపించి పబ్బం గడుపుకునే గిరీశాలు, మాటమాటికి వేషాలు మార్చే లుబ్ధావధానులు, స్త్రీలను మనుష్యులుగానే పరిగణించని అగ్నిహోత్రావధానులు... ఇలా ప్రతి పాత్ర, ప్రతి సన్నివేశం మానవజీవితంలో దాగున్న అనేక కోణాలను ఆవిష్కరించేదే.

... విద్యావ్యవస్థను నిలదీశాడు

ప్రస్తుత విద్యావ్యవస్థ కూడా ఈ రోజున గురజాడను మనకి నిత్యం గుర్తుకు తెస్తోంది. 'వేదం యనభై రెండు పన్నాలు ఒహ దమ్మిడీ పుస్తకాల ఖర్చు లేకుండా చదువుకున్నా' అనే అగ్నిహోత్రావధానులుకు వెంకటేశం చదువు ఆయనకు శక్తికి మించినదయిపోతుంది. విద్య అనేది జన సామాన్యానికి అందుబాటులో లేని ఖరీదైన వ్యవహారంగా మారుతోందని ఆనాడే గురజాడ చెప్పాడు. 'కొత్త పుస్తకాలకి జాబితా రాయి. కొంత డబ్బు చేతిలో ఉంటే కాని సిగార్సుకి ఇబ్బంది తప్పుతుంది' అంటూ పది పుస్తకాలను సంఖ్యను బట్టి రాయిస్తాడే తప్ప అవసరాన్ని బట్టి కాదు. పుస్తకాల ప్రచురణలు, షాపులతో లావాదేవీల వలన నేటి పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులు పుస్తకాలపై పెట్టే ఖర్చు తలచుకుంటే గడచిన కాలం శతాబ్దమైనా పరిస్థితి ఇసుమంత కూడా మారలేదనిపిస్తుంది. ఇదీకాక, పిల్లలకి చిన్న వయస్సు నుండే కంప్యూటర్, లేబరేటరీ, ప్రయోగాలు, లాంగ్వేజి లాబ్‌లు అని చెపితే

సంబరపడిపోయి ఆ స్కూళ్ళవైపు పరిగెత్తే తల్లిదండ్రులు భవిష్యత్తులో ఎక్కువవుతారని ఊహించాడు కాబట్టే గిరీశం 'ఇంగ్లీషు స్కూల్లో పిల్లలకి జాగ్రఫీ, గీగ్రఫీ, అర్థమెటిక్, ఆల్జీబ్రా, మాథమెటిక్స్ యివన్నీ పడవేసి చెప్తారండి' అంటూనే 'మీ కుర్రావాడిలాగా చదువుకునేవాడికి ఒక నిమిషమైన తీరికుండదు' అనగానే అగ్నిహోత్రావధానులు'అదుగో చదువంటే అష్లాగే చదువుకోవాలి' అనడం, గిరీశం దానికి ముక్తాయింపుగా 'పుస్తకం చేతపడితే వేళ్ళకి పుస్తకం అంటుకుపోవాలి అలా చదివిస్తానండి' అనడం గమనిస్తే విశ్రాంతికన్నా చదువు ముఖ్యం అనుకునే దశ వచ్చేస్తోందని ఆనాడే గమనించిన గురజాడకి సెల్యూట్ చేయవలసిందే.

సాహిత్యం సామాజిక బాధ్యత

ఆఖరిది, ముఖ్యమైనది గురజాడ సాహిత్యాన్ని ఒక సామాజిక బాధ్యతగా Though art is my master, I have a duty to society అని భావించినవాడు కాబట్టే తను చేసిన ప్రతి రచన అదే సామాజిక బాధ్యతతో చేశాడు. సంస్కరణోద్యమాలలో ఉన్న ఉపరితల అవగాహనను విమర్శించడం, స్త్రీలపట్ల మనం పెంచుకోవలసిన గౌరవం, కులమతాల పట్ల ఏవగింపు, మానవత పట్ల ఆదరణ, ఎల్లలోకము వొక్కయిల్లై / వర్ణభేదము లెల్లకల్లై / నేల నెరుగని ప్రేమ బంధము / వేడుకలు కురియా' అని వసుధైక కుటుంబ భావనని ప్రతిపాదిస్తాడు. 'మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అని చాటుతాడు. మంచి అన్నది మాల అయితే నేను మాలనే అవుతా అని చెప్పి గాంధీ కంటే ముందే అస్పృశ్యతను గురించి చెప్పినవాడు గురజాడ. అన్నింటికి మించి దేశమంటే సరిహద్దులు, సంస్కృతి, సంప్రదాయం అంటూ చెప్పుకునే కాలంలో 'దేశమంటే మట్టి కాదు, మనుష్యులని చెప్పినవాడు గురజాడ. అందుకే 'దేశభక్తి' గీతాన్ని శ్రీశ్రీ 'సమస్త ప్రపంచ మహాజనుల జాతీయ గీతం'గా అభివర్ణించాడు.

1897లో కన్యాశుల్కం మొదటి కూర్పుకు పీఠిక రాస్తూ, సాహిత్యాన్ని, భాషను a great civilizing medium (ఒక గొప్ప నాగరికతా ప్రదాత)గా అభివర్ణించడం గురజాడ దార్శనికతకు ఎల్లలు లేవు అని చాటి చెప్పింది. 'సాయంకాలమైంది' అన్నదానితో ప్రారంభమైన గురజాడ సాహిత్యం క్షీణ యుగ లక్షణాలని, మూఢ ఆచారాలని పారద్రోలి జాతికి ఒక కొత్త ఉదయాన్ని చూపాడనడానికి సాక్షిగా ఆయన 'ముత్యాలసరాల'ని 'తూర్పు బల బల తెలవారెను'తో ప్రారంభిస్తాడు. మానవజాతిని అల్లుకున్న చీకటిని పోగొట్టి, మానవత్వాన్ని, మనిషికి – మనిషికి మధ్య గాఢమైన స్నేహాన్ని, పొరుగు వారిపట్ల ప్రేమని, స్త్రీ పట్ల గౌరవాన్ని అందించే వెలుగును సమకూర్చినవాడు గురజాడ. prof.Hinden చెప్పినట్లు 'పదాలు సజీవంగా ఉండాలంటే అవి జీవితంలో మునిగి తేలుతూ ఉండాలి' అంటారు. అలా జీవితంలో మునిగి తేలే అనేక విషయాలను తన సాహిత్యంలో ఇమిడ్చి, ఆధునిక తెలుగు సాహిత్యానికి, సమాజానికి కొత్త ఆశని, మేలైన జీవికని ఇచ్చిన భవిష్యత్ ప్రదాత గురజాడ. అందుకే తను లోకాన్ని విడిచివెళ్ళిన శతాబ్దం తర్వాతా, భవిష్యత్తులో కూడా గురజాడ నిత్యం వెలిగే ఒక వెలుతురు దివ్వెగా నేలాకాశాల మధ్య నిలిచిపోతాడు.

నవ్వుల్ – పువ్వుల్



లారీల స్ట్రైక్

కిందటి వారం మరణాల సంఖ్య బాగా తగ్గిందెందుకు?అడిగాడు యముడు

పోయిన వారం భారతదేశంలో లారీల స్ట్రైక్ జరిగింది ప్రభూ చెప్పాడు చిత్రగుప్తుడు.



అందాన్ని చూసి...

నిజంగా మీరు నా అందాన్ని చూసి పెళ్ళి చేసుకున్నారా?

అవును భార్య రూపవతి శత్రు అని అందంలేని నిన్ను పెళ్ళి చేసుకున్నాను.. చెప్పాడు రాజేష్

గొడవ



నా భార్య నాతో గత నెలరోజులుగా పోట్లాడటం మానేసింది..!

ఆనందంగా చెప్పాడు సునీల్

ఆమెతో ఏమన్నావేమిటి కుతూహలంగా అడిగాడు సుందర్

నువ్వు కోప్పడినప్పుడల్లా నీ ముఖంలో ముడతలు కనిపిస్తున్నాయి అన్నానంతే.!!

మరింత ఆనందంగా చెప్పాడు సునీల్

తెలివైన భర్త



ఒరేయ్ రామూ తెలివైన రచయిత్రి భర్త ఎలా ఉంటాడో

ఎంతగా తలుపు తట్టినా భార్య తలుపు తీయకపోతే...

"పోస్ట్" అని బిగ్గరగా అరిచేవాడు రా చెప్పాడు సోము.

కన్ను కొడుతున్నాడు

నాన్న ఎదురింటబ్బాయి నాకు కన్ను కొడుతున్నాడు..అంది కూతురు

వాడెప్పుడు అంతే నమ్మా.. ఏదో ఒకటి తీసుకొని ఎవరో ఒకర్ని కొడుతూనే ఉంటాడు. ఈ సారి నువ్వు కూడా కొట్టేయ్. పరధ్యానంగా అన్నాడు తండ్రి.

యాలుక్కాయల షాపు



జంబులింగం: ఒరేయ్... మొన్న పది కాసుల బంగారం కొన్నారు, యాలక్కాయల షాపులో

శంభులింగం: అది యాలక్కాయల షాపు కాదురా జోయ్ అలూకాస్

చెంప చెళ్లుమంది

వీరబాబు రైల్వే ఇంటర్వ్యూకి వెళ్లాడు.

గతంలో మీరు రైల్లో ప్రయాణిస్తుండగా యాక్సిడెంట్ ఏదైనా జరిగిందా? ప్రశ్నించాడు అధికారి

జరిగింది.

ఎప్పుడు?

ఒకసారి అరకు రూట్‌లో సొరంగం వచ్చినప్పుడు నా ముందున్న అమ్మాయికి కిస్ ఇవ్వబోయి ...

పొరబాటున వాళ్ల నాన్న కిచ్చాను. చెంప తడుముకుంటూ చెప్పాడు వీరబాబు.

టైమ్

సుధీర్: సార్! టైమెంతయింది?

శంకర్: తొమ్మిదీ పది

సుధీర్: కరెక్టుగా చెప్పండి సార్?

మరీ గంట తేడాతో చెబుతారేం!!

చికెన్ హెర్బ్ సూప్

కావాల్సిన పదార్థాలు

100 గ్రాములు బోన్‌లెస్ చికెన్, ఒక లీటరు నీరు, ఒక టీ స్పూన్ వెల్లుల్లి ముక్కలు, ఒక బే ఆకు, ఒక పచ్చి మిరపకాయ, అర టీ స్పూన్ జీలకర్ర, 15 గ్రాములు ఓట్స్ పౌడర్, ఒక టీ స్పూన్ మిరియాల పొడి, అర టీ స్పూన్ గరం మసాలా, ఒక టీ స్పూన్ నూనె, ఉప్పు

తయారీ

చికెన్ శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి పాత్రలో నీరు పోసి వెల్లుల్లి, బే ఆకు, పచ్చి మిరపకాయలు వేసి అరగంట సన్నని సెగపై ఉడికించి పక్కన ఉంచుకోవాలి. విడిగా ప్యాన్‌లో నూనె వేడిచేసి జీలకర్ర, ఓట్స్ పొడి చేసి ఓ నిమిషం ఉంచి, చికెన్ మసాలా, ఉప్పు కలిపి సన్నని సెగపై మరగనివ్వాలి. వేడిగా మసాలా, ఉప్పు కలిపి సన్నని సెగపై మరగనివ్వాలి. వేడిగా ఈ సూప్ తాగాలి.

సూప్...వేడి వేడిగా...

వెల్లుల్లి వెజిటబుల్ దాల్ సూప్



కావాల్సిన పదార్థాలు

పావు కప్పు ఉల్లిపాయ ముక్కలు, రెండు టీ స్పూన్లు వెల్లుల్లి ముక్కలు, ఒక కప్పు మిక్స్‌డ్ వెజిటబుల్స్ (క్యారెట్లు, ఫ్రెంచ్ బీన్స్, క్యాలిఫ్లవర్, బఠాణీలు, బేబీ కార్న్), రెండు కప్పులు నీరు, అర కప్పు నీరు, అర కప్పు కంది పప్పు, రెండు టేబుల్ స్పూన్లు ఓట్స్ పౌడర్, రెండు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర తరుగు, ఒక టీ స్పూన్ నూనె, ఉప్పు, మిరియాల పొడి.

తయారీ

ప్యాన్‌లో నూనె వేడి చేసి ఉల్లిపాయలు, వెల్లుల్లి ముక్కలు వేసి వేయించాలి. కూరగాయ ముక్కలు కలిపి కొద్ది నిమిషాలు వేగనివ్వాలి. నీరు నానబెట్టిన పప్పు, ఉప్పు, మిరియాల పొడి కలపాలి. పొంగు వచ్చాక సిమ్‌లో ఉంచి మెత్తబడనివ్వాలి. ఓట్స్ పౌడర్ కలిపి మరో ఐదు నిమిషాలు సిమ్‌లో ఉంచాలి. కొత్తిమీర తరుగు జల్లి వేడిగా సిప్ చేయాలి.

చైనీస్ సూప్



కావాల్సిన పదార్థాలు

వెజిటబుల్ స్టాక్–నాలుగు కప్పులు
పుట్టగొడుగులు–1/2 కప్పు
బేబీ కార్న్ ముక్కలు – ఒక కప్పు
ఉప్పు – తగినంత
నూనె – ఒక స్పూన్
సోయాసాస్ – రెండు చెంచాలు
వెనిగర్ – రెండు చెంచాలు

తయారీ

ముందుగా దళసరి గిన్నెలో వెజిటబుల్ స్టాక్‌లో పుట్టగొడుగులు,బేబీ కార్న్, క్యారెట్ ముక్కలు వేసి కాసేపు మరగబెట్టాలి. తరువాత ఉప్పు వేసి కలపాలి. చివరగా సోయా సాస్, వెనిగర్ కలిపి సర్వ్ చేయాలి. ఇది వెరైటీగా ఉంటుంది.

టొమేటో, కాలిమిర్చి షోర్బా



కావాల్సిన పదార్థాలు

600 గ్రాములు టొమేటోలు, ఒక టేబుల్ స్పూన్ అల్లం ముక్కలు, ఒక టేబుల్ స్పూన్ వెల్లుల్లి ముక్కలు, రెండు పచ్చి మిరపకాయలు, పది గ్రాముల మిరియాలు, ఒక టేబుల్ స్పూన్ గరం మసాలా, రెండు బే ఆకులు, ఒక టీ స్పూన్ జీలకర్ర, ఒక టీ స్పూన్ మిరియాల పొడి, ఒక టేబుల్ స్పూన్ పంచదార (కావాలనుకుంటే) ఒక టేబుల్ స్పూన్ కొత్తిమీర, ఒక టేబుల్ స్పూన్ నూనె, ఉప్పు

తయారీ

టొమేటోలు శుభ్రంగా కడిగి కట్ చేసుకోవాలి. టొమేటో, అల్లం, వెల్లుల్లి, పచ్చి మిరపకాయ ముక్కలు, గరం మసాలా, మిరియాలు కలుపుకోవాలి. ఐదు కప్పులు నీరు పోసి, రెండు బే ఆకులు వేసి మరిగించాలి. 20 నిమిషాలు సిమ్‌లో ఉంచాలి టొమేటోలు మెత్తగా గుజ్జు మాదిరి ఉడికిపోవాలి. సూప్ స్ట్రెయినర్‌తో వడ కట్టాలి. ప్యాన్‌లో నూనె వేడి చేసి, జీలకర్ర వేసుకోవాలి. చిటపటలాడాక వడకట్టిన టొమేటో లిక్విడ్ కలపాలి. ఉప్పు, మిరియాల పొడి వేసి మరిగించి, కొత్తిమీరతో అలంకరించి వేడిగా సర్వ్ చేయాలి.

యువ

ఉత్తరానికి చిరునామా

ఈ రోజు ఎన్ని గుడ్ మార్నింగ్ మెసేజీలు పెట్టారు. ఈ-మెయిళ్లలో ఎన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు నెరిపారు. అబ్బో బానే సందేశాలందిస్తున్నారే. వీటి సంగతి సరే మీరు ఈ రోజు ఒక్క పోస్ట్ కార్డు అయినా రాశారా? పోనీ ఒక్క ఉత్తరమైనా అందిందా? ఆ రోజులు ఎపుడో పోయాయంటున్నారు కదా. మరి పుణెలోని ప్రదీప్ లోకండే గురించి చెప్పాలి మీకు. ఈ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ యుగంలో ఆయనకు రోజు 150 ఉత్తరాలు వస్తుంటాయి. తాను పదుల ఉత్తరాలు రాసేస్తుంటాడు.



ప్రదీప్ లోకండే పెద్ద రాజకీయవేత్త కానేకాదు. అలాగని సెలబ్రెటీ కూడా కాదు. కానీ ఒక పంక్తి చిరునామా (సింగిల్ అడ్రస్ లైన్) ఉన్న ఒకే ఒక వ్యక్తి. కేవలం అతడి పేరు పక్కన పుణె, పిన్‌కోడ్ రాసేసి ఉత్తరమేసినా ఆయనింటికి చేరిపోతుంది. అలా రాసిన ఉత్తరాల కట్టను వేసుకుని పోస్ట్‌మ్యాన్ ఆయన ఇంటికి బయలుదేరుతాడు. ప్రదీప్ ఓ అసాధారణ వ్యాపారవేత్త. ఆయన వ్యాపారమంతా పల్లె బాగోగుల సమాచారం మీదే సాగిపోతుంది. ఏ పల్లెలో ఎన్ని మరుగుదొడ్లు ఉన్నాయి. ఏ గ్రామానికి ఏ వస్తువు అత్యవసరమో వంటి విషయాలతో ఆయన వద్ద 49 వేలకు పైగా గ్రామాల డేటాబేస్ ఉంది. వీటితో ఎలా వ్యాపారం చేస్తాడంటే ఆ సమాచారాన్ని వస్తు విక్రయ కంపెనీలకు అందించి వారి సర్వేను తేలిక చేస్తాడు. అందుకు గాను రుసుం తీసుకుంటాడు. దానిలో కొంత పల్లె బాగుకు ఖర్చు పెడతాడు. నిద్రలో లేపి అడిగినా వేల గ్రామాల విషయాల్ని టకాటకా చెప్పే ప్రదీప్ ఆ గ్రామాలన్నింటినీ జల్లెడ పట్టి సేకరించిన విషయాలవన్నీ. పది రాష్ట్రాల్లోని 5 వేలకు పైగా గ్రామాల్ని చుట్టేసిన ప్రదీప్ పల్లె కష్టాలు తీర్చేందుకు ఎన్.ఆర్.వీ (నాన్ రెసిడెంట్ విలేజర్) ఉద్యమాన్ని తెరపైకి తెచ్చాడు. ఎన్నారైలా అనిపిస్తున్న వీళ్లెవరా అంటే మీరూ నేను అనేస్తాడు. ప్రతి భారతీయుడి మూలాలన్నీ పల్లెవే అని గట్టిగా చెప్పే ప్రదీప్ ఆ గ్రామీణుడిని బయటకు తీయండని కోరతాడు. తన ఊరి బాగు కోసం వాడు ఏం చేయగలడో ఆలోచించాలని కోరతాడు. ప్రదీప్‌లోని గ్రామవాసి అయితే ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల్లోని గ్రామాల్లో 3055 గ్రంథాలయాల స్థాపనలో ప్రధాన పాత్ర వహించాడు. 370 పల్లె బడుల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేశాడు. పల్లె అవసరం తీరేలా వ్యాపార దిగ్గజాల బాధ్యతకు వారధి కట్టాడు. ఆయన ఇప్పటి వరకు 58 లక్షల మంది పల్లెవాసులతో ఉత్తర ప్రత్యుత్తరాలు పోస్టు కార్డు ద్వారా జరిపాడు. సొంత రాష్ట్రం మహారాష్ట్రతో పాటు ఉత్తరప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, గుజరాత్ వంటి అనేక రాష్ట్రాల పల్లెల నుంచి పాఠశాల విద్యార్థులు తమ సందేహాలు, సందేశాలు ఉత్తరం రాస్తారు. ఈయన నెలకొల్పిన జ్ఞాన్ కీ లైబ్రరీలు ద్వారా పల్లె విద్యార్థి బుర్ర పదునుదేరడమే కాదు భవిష్యత్తు కలల్ని నిజం చేసుకోవడానికి మార్గాన్ని తేలిక పరుస్తున్నాయి. ఉత్తరాలు రాసేవారిలో ఉద్యోగార్థులు కూడా ఎక్కువే. వీరికి వీలైనంత త్వరలో జాబు రాసే ఆయన ఉత్తమమైన ఎన్నో కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పించాడు. 1996లో నెలకొల్పిన రూరల్ రిలేషన్స్ అనే కంపెనీకి ఈ ఉత్తరాలే కీలకం. తొలుత భార్య, తండ్రితో కలిసి సుమారు 20 వేల ఉత్తరాలు రాశాడు. వాటిని గ్రామాల పోస్ట్‌మాస్టర్లు, టీచర్లు, పెద్దలకు రాశాడు. గ్రామ సంత వివరాలు, పల్లె అవసరాలపై సమాచారాన్ని కోరాడు. స్పందన అంతంత మాత్రమే అయినా తర్వాతర్వాత పుంజుకుంది. ఏకంగా ఇప్పటి వరకు 58 లక్షల మందితో పోస్ట్‌కార్డుల సంభాషణలు సాగాయి. తన కూతురు కాదంబరి వివాహ ఆహ్వాన పత్రికల్ని కూడా పోస్ట్ కార్డుపై అచ్చువేయించి పంపాడు.

దేశంలో మూడు లక్షల గ్రామాలున్నాయి. లక్షా 13 వేల పోస్ట్ ఆఫీసులున్నాయి. ప్రపంచంలోనే అతి పక్కాగా ఉన్న పోస్టల్ వ్యవస్థల్లో మనదొకటి. దాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని చెప్పే ప్రదీప్ ఉత్తర దొంతరల్లో ఎన్నో జ్ఞాపకాలు పదిలంగా ఉన్నాయి. ముఖ్యంగా చిన్నారుల నుంచి వచ్చే ఉత్తరాలు గమ్మత్తుగా వారి కేరింతల్లా మురిపెంగా కనిపిస్తాయి ప్రదీప్‌కు. ఏది ఇచ్చినా ఇవ్వకున్నా ప్రదీప్ మోములో నవ్వు కనిపిస్తుందో లేదో గానీ ఉత్తరం కనిపిస్తే మాత్రం ఆనందంతో వికసిస్తుంది అని కుటుంబ సభ్యులు చెబుతారు. అంటే రోజుకు తెలీకుండానే 150 సార్లు ఆనందంలో మునిగితేలతాడన్న మాట. ఎస్ఎంఎస్, ఈ మెయిళ్లలో ఇది సాధ్యమో కాదో అని చెప్పే ప్రదీప్ పాయింట్ దస్తూరీనే. ఆ వ్యక్తిని అక్షరాల ఆకృతుల్లో చూసుకుంటాడీ ఉత్తరాల మాస్టర్.

✦

ప్రతి ఇంట్లో రోజూ ఎంతో కొంత ఆహారం వృథా అవుతుంటుంది. ఇక పెళ్లి
చెప్పనే అక్కర్లేదు. ఎన్ని రకాల ఐటమ్స్ పెడితే అంత గొప్ప. తిన్నారా వదిలేశా
వేస్ట్ చేసేదే ఎక్కువ'. ఈ మాట సాక్షాత్తూ ఐక్యరాజ్య సమితి చెప్తోంది. ఎ
మాట అది. ఓ వైపు లెక్కా పత్రం లేకుండా అయ్యే వృథా అయిపోతూ వుం
లోపంతో, రక్తహీనతతో కునారిల్లుతుంటారు పేదలు. ఇటు వృథా అయ్యే ఆ
అందించలేకపోయినా... జాతి సంపదైన ఆహారాన్ని వేస్ట్ చేయకుండా చూ
దేశాలు ఒక అడుగు ముందుకు వేసి ఆహారాన్ని వేస్ట్ చేసేవారికి ఫైన్ వేస
అలాగైనా వృథాకు కొంతవరకైనా అడ్డుకట్ట వేయవచ్చని ఆశ.

వృథా చేస్తే

ఫ్రాన్స్‌లో పడిపోద్ది

కిరాణా సరకులు అమ్మే గ్రాసరీ షాపుల్లోనూ చాలా వృథా అవుతుంటుంది. ఎక్స్‌పైర్డ్ తేదీ అయిపోయే వరకు అమ్ముడు పోకుండా మిగిలిపోయిన ఆహార పదార్థాలను వారు చెత్తబుట్టలకు తరలిస్తుంటారు. అలా చేసిన షాపులకు ఫైన్ వేస్తున్నాయి స్థానిక ప్రభుత్వాలు. 75,000 డాలర్ల వరకూ వుంటోందా ఫైన్. వృథా అయిన పదార్థాల పరిమాణాన్ని బట్టి ఫైన్‌తో పాటు జైలు శిక్ష కూడా విధిస్తున్నాయి. పనిలో పనిగా ఓ విలువైన సలహా కూడా ఇస్తున్నాయి. డేట్ అయిపోయే వరకు ఆగకుండా కొద్దిగా ముందే వాటిని ఏ అనాథ శరణాలయాలకో ఇచ్చివేయమని చెప్తున్నాయి. జరిమానా బాధ తప్పుతుంది. దిక్కు లేని వారి కడుపూ నిండుతుంది అన్నది వాటి ఆలోచన. ఈ విధంగా చేయాలని ఫ్రాన్స్ నేషనల్ అసెంబ్లీలో బిల్లు కూడా పాస్ అయింది మరి. ఇంత తీవ్రమైన నిర్ణయం తీసుకోవడానికి కారణం లేకపోలేదు. అక్కడ ప్రతి ఏడాది 7.1 మిలియన్ టన్నుల ఆహారం వృథా అవుతోంది. ఇందులో రిటైల్ అమ్మకం దార్లు చేసే వృథా కేవలం 11 శాతమే. వినియోగదారులు పారేసేది 67 శాతం. ఇక రెస్టారెంట్లు 15 శాతం వృథా చేస్తుంటాయట.

స్విస్‌లోనూ వేస్తున్నారు

స్విట్జర్లాండ్ వారు ఆతిథ్యం ఇవ్వడంలో చాలా ముందుంటారు. అయితే పళ్లెంలో పెట్టించుకున్న ఆహారాన్ని తినకుండా విడిచి పెడితే మాత్రం చూస్తూ ఊరుకోరు. పళ్లెంలో వున్నదంతా శుభ్రంగా తినేసెయ్యాలంతే. లోసోన్‌లోని పాట్రిజెట్ట రెస్టారెంట్‌లో బఫే భోజనం చేస్తే 12 ఫ్రాంకులు కట్టించుకుంటారు ఏదైనా తినకుండా వదిలితే మాత్రం అదనంగా 5 ఫ్రాంకుల జరిమానా కట్టాలి. వేస్ట్‌గాళ్లలో ఆలోచన కల్పించాలన్న ఆలోచనతోనే ఫైన్ వేయాలన్న నిర్ణయానికి వచ్చిందా రెస్టారెంట్.

సాంబార్

వేడి వేడి ఇడ్లీ సాంబార్
ఎవరికి మాత్రం ఇష్టముండద
లొట్టలు వేసుకుంటూ తినేయ
సెంట్రల్ ముంబైలోని ఉడుపి
హౌస్ అయితే రుచికరమైన ఇ
సాంబార్‌కు మాంచి పేర్గాంచి
మరి 32 రకాల ఇడ్లీ వండి
వడ్డిస్తారు. ఆ తర్వాత కమ్మటి
ఇస్తారు. ఇంతకంటే ఏం కావా
మనసులకు, నీరసించిన మా
వచ్చి తినిపోతుంటారు. అయి
పెట్టారు. అదేమంటే 'ఎంతో
ఇష్టంగా తింటే ఎన్నిసార్లయినా
పదే పదే పోయించుకొని వృథా
ఎవరైనా సరే అలా చేస్తే... ఫై
నిర్వాహకులు. ఇంతకీ ఫైన్
రూపాయల వరకు. మరి ఏం
చుక్కలనంటుతోంది. సాంబార్
ఈ ఏర్పాటు. ఇలాగైనా అవస
తింటారని ఆశ.

పెద్దన్నల ఫైన్

ప్రపంచ పెద్దన్నగా పేరొందిన అమెరికా
చేయడంలోనూ ముందున్నారు. కొనుగో
శాతం ఆహారం సీదా చెత్తబుట్టల్లోకి చే
న్నాయి. అమెరికాలోని కొన్ని రాష్ట్ర ప్ర
జరిమానా విధిస్తున్నాయి. సియాటెల్ న
కేజీల చొప్పున లెక్కించి ఫైన్ కట్టించుకు
ప్రాంతాల్లో నివసించేవారికి వేసే జరిమ

ళ్లు, రెస్టారెంట్లు, హోటళ్లలో అయ్యే వృథా సంగతి
రా అన్నది వారికనవసరం. 'తింటున్న దానికంటే
ల్లో అధ్యయనాలు, అంచనాల తర్వాత చెప్పిన
టుంది. మరోవైపు తిండికి గతిలేక పౌష్టికాహార
హారాన్ని అటు తరలించి వారికి
సుకోవాల్సిన బాధ్యత అందరిదీ. అందుకే కొన్ని
స్తున్నాయి. అందుకు తగ్గ చట్టాలూ చేస్తున్నాయి.

ఫైన్ వడ్డిస్తారు

దిలితే ఫైనే



ంటే
!
మా!!
ఇడ్లీ
డ్లీ
ంది.

వాసనలు వెదజల్లే ఫిల్టర్ కాఫీ
లి చెప్పండి? ఆ అలసిన
వులకు? ఎక్కడెక్కడి నుంచో
తే ఈ మధ్య అక్కడో నిబంధన
శ్రద్ధగా వండిన ఇడ్లీసాంబార్‌ను
పెట్టొచ్చు. కానీ... సాంబార్
చేయడమే కష్టంగా వుంది.
న్ వేసేస్తాం' అని చెప్తున్నారు
ంత? అంటే 8 నుంచి 10
చేస్తారు? కందిపప్పు ధర
ని వృథా చేయడం చూడలేకే
మైనంతే వేయించుకుని

దేశస్థులు ఆహార పదార్థాలను వృథా
లు అయిన ఆహారంలో 30 నుంచి 50
రిపోతోందని సర్వేలు గొడవ పెట్టేస్తు
భుత్వాలు ఈ వృథాను తగ్గించడానికి
నగరంలో వృథా అయిన పదార్థాలను
ంటున్నారు. అపార్టుమెంట్లు, వాణిజ్య
ైనా 50 డాలర్ల వరకు వుంటుంది.

జస్ట్ 5 ఫ్రాంకులే

చైనా, జపాన్ దేశాలనగానే సముద్ర జీవులతో చేసిన వంటకాలు గుర్తొచ్చి నోరూరిపోతుంది భోజన ప్రియులకు. ఆశగా రకరకాల పదార్థాలను తెప్పించేసు కుని... తినలేక... కక్కలేక...

సతమతమయ్యే వారికి బానే చెక్ పెడుతోందో రెస్టారెంట్. 'సప్పోరో'లో హాచికో రెస్టారెంట్ చేపలు, పీతలు, ఎండ్రకాయలు, సీ హార్స్‌లు... వంటకాలకు పెట్టింది పేరు. ఇప్పుడు మనం వరసపెట్టి చెప్పుకున్న జీవుల గుడ్లతో చేసిన 'సుక్కో మెషి' అనే వంటకానికి ప్రత్యేక డిమాండ్ వుంటుంది. నగరంలో అడుగెట్టిన ప్రతివారూ తప్పకుండా తినాలని ఆశపడుతుంటారు. ఒక చిన్ని పింగాణీ గిన్నెలో సగం పైగా అన్నం, ఆ పైన సాస్‌లో ఉడికించిన సముద్ర జీవుల గుడ్లు పొర్లేలా పోసి ఇస్తారు. ఇహ...లాగించడమే తరువాయి. అయితే ఎవరైనా తినకుండా వదిలారో... అయిపోయారే. ప్లేటుకు అదనంగా ఐదు ఫ్రాంకుల ఫైన్ పడిపోద్ది. జాలర్లు ఎంతో కష్టపడి అరుదైన సముద్ర జీవుల చేపగుడ్లను సేకరిస్తుంటారు. అందుకోసం ఒక్కోసారి వారి ప్రాణాలను సైతం కోల్పోతుంటారు. అటువంటి అరుదైన గుడ్లతో చేసిన వంటకాలను వృథా చేయడమంటే ఆ జాలర్లను కించపరచడమే. అందుకే ఇలా దాని నివారించాలనుకుంటున్నాం' అంటున్నారు రెస్టారెంట్ నిర్వాహకులు. ఏదేమైతేనేం? వృథాను నిలిపివేయడానికి ఇదో ప్రయత్నం!

జర్మనీ తక్కువ కాదు

ఒకరిని చూసి ఒకరనుకోండి. సొంతగా వచ్చిన ఆలోచనే అనుకోండి. జర్మనీలోనూ ఫైన్ వేస్తున్నారు. ఇక్కడి రెండవ అతి పెద్ద నగరమైన హాంబర్గ్‌లోనూ వేస్తున్నారు జరిమానా. మామూలుగా కాదు. అందుకు ఒక చిన్న ఘటన చెప్పుకుంటే సరిపోతుంది. ఓ వ్యక్తి కొత్తగా హాంబర్గ నగరం వెళ్లాడు. స్నేహితులతనికి స్వాగతం పలికి ఓ రెస్టారెంట్‌లో విందు ఏర్పాటు చేశారు. వారు వెళ్లేసరికి అక్కడ చాలా టేబుళ్లు ఖాళీగా వున్నాయి. అక్కడ ఒక యువ జంట భోజనం చేస్తోంది. వారి పళ్లెంలో 2 రకాల పదార్థాలు, 2 బీరు బాటిళ్ల మాత్రమే వున్నాయి. అంత సాదాసీదా భోజనం చేస్తున్న జంటను చూసి వీరిలో ఒకరు ఆశ్చర్యపోయారు కూడా. వారికి దూరంగా కొంతమంది వృద్ధ మహిళలు కూర్చుని వున్నారు. ఆర్డర్ ఇచ్చిన పదార్థాన్ని తీసుకొచ్చిన ఉద్యోగి అందరి పళ్లేల్లోను సర్ది వెళ్లిపోయాడు. వీళ్లు కబుర్లు చెప్పుకుంటూ నిదానంగా పళ్లెంలో వున్నదంతా చిన్న ముక్కతో సహ తినేశారు. వాళ్లనంతగా పట్టించుకోని యువకులు ఆకలిగా వున్నారనో ఏమో స్థానిక నేస్తం చాలా రకాల పదార్థాలను ఆర్డర్ ఇచ్చాడు. అయితే బైట చాలా చాలా పనులు పెట్టుకోవడం వల్ల హడావిడిగా గతికేసి బైటపడ్డారు. అయితే అక్కడి ముసలమ్మలు మాత్రం ఊరుకోలేదు. వెంటనే బిల్లు కలెక్టర్ దగ్గరకెళ్లి పోట్లాడసాగారు. అతనెవరికో ఫోన్ చేయడం ... ఒక ఫైల్‌మాన్ వచ్చి దాదాపు గేటు బయట వున్న వారిని లోపలికి లాక్కొచ్చి 50 యూరోల జరిమానా విధించడం రెండూ ఏక సమయంలో జరిగిపోయింది. ఇంతకీ ఆ యువకులకు రెస్టారెంట్ నిర్వాహకులు ఏం బోధించారో తెల్సా! 'మీకు నచ్చింది ఆర్డర్ ఇవ్వండి. తినండి. తిన్నదానికి కట్టే డబ్బు మీదే అయినా... తిండి పదార్థాలపై సమాజం అంతటికి హక్కు వుంది. ప్రపంచంలో ఎంతో మంది తిండి లేకుండా నకనకలాడిపోతున్నారు. అటువంటప్పుడు జాతి సంపదను వృథా చేసే హక్కు మీకు లేదు' అని చెప్పి పంపారు మర్యాదగా. యాభై యూరోలు పోతే పోయాయి కానీ... ఎంత మంచి మాటలు చెప్పారో కదా. ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఇక్కడ కస్టమర్లకు కొసరి కొసరి వడ్డిస్తారు. వేస్ట్ చేస్తేనే వారికి కోపం వస్తుంది. ఎంగిలి కంచం కూడా నాకినట్టు శుభ్రంగా వుండాలి. ఇది అక్కడి నియమం. ప్రభుత్వం చేసిన ఈ చట్టాన్ని స్థానిక రెస్టారెంట్లు బాధ్యతగా అమలు చేస్తున్నాయి.

గ్లామరు నటి

తొలి సినిమా టైటిల్‌నే తన ఇంటిపేరుగా మార్చుకున్న నటి. తెలుగు, ఇంగ్లీషు, తమిళ, హిందీ, మళయాళ భాషల్లో అనర్గళంగా మాట్లాడగల అరుదైన నటి. ఛాందస భావాలు కలిగిన కుటుంబంలో పుట్టినా ఇప్పటి వరకూ స్వతంత్ర భావాలకే పెద్ద పీట వేసి అనితర సాధ్యమైన విజయాలన్నిటిని తన ఖాతాలో జమ చేసుకున్న నటి.

తొలి చిత్రం ఓ గొప్ప సంస్థ, గొప్ప దర్శకుడితో తెలుగు తెర మీద ఎవర్ గ్రీన్ క్లాసిక్‌గా నిలిచిన షావుకారు చిత్ర కథానాయిక షావుకారు జానకి.రాజమండ్రిలో 1931 డిసెంబరు 12న వెంకోజీ రావు సచీదేవి దంపతులు తొలి సంతానంగా పుట్టింది. ఆమె చిన్నతనం నుంచీ మంచి చదువరి. చిన్నతనంలో ఆమెను పుస్తకాల పురుగు అనేవారు. తల్లిదండ్రుల పెంపకం కఠినంగా వుండేది. తల్లిదండ్రుల చాటు బిడ్డగా పెరిగింది. ఉన్నత భావవ్యక్తీకరణ, పరిపూర్ణమైన అవగాహన అన్నిటినీ మించి అర్థవంతమైన చదువు ఆమె వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. భాషను అమితంగా ప్రేమించే నైజం వుండటంతో తాను నేర్చుకుంటున్న భాష పట్ల లోతైన అవగాహన కోసం కృషి చేసేది. అదే ఆమె ఉన్నత శిఖరాలు అధిరోహించేలా చేసింది. జానకి భాషా పటిమను చూసి పాశ్చాత్యులు సైతం అబ్బురపడేవారు.

సినిమాల్లోకి రావడం యాదృచ్ఛికం

తాను పెరిగిన వాతావరణానికి సినిమా జీవితానికి ఎక్కడా పొంతన కనిపించదు. అమాయకంగా కనిపించే గడుసరి నటి జానకి. బహుశా ఇదే వాహినీ సంస్థలో ఆమెకు షావుకారు చిత్రంలో అవకాశం కల్పించింది. 1949లో మొదట 'రక్ష రేఖ' చిత్రంలో నటించినా షావుకారు చిత్రమే తొలి చిత్రంగా ప్రాచుర్యం పొంది షావుకారు జానకిగా నిలిచిపోయింది. నిజానికి జానకికి సినీఫీల్డులోకి రావాలన్న ఆలోచన లేదు. యాదృచ్ఛికంగా జరిగిపోయింది. యన్.టి.ఆర్ ఆమె పలుకు తీరుని మెచ్చుకుని తన బ్యానరులో తీసిన తొలిచిత్రం పిచ్చిపుల్లయ్యలో కథానాయికగా అవకాశం కల్పించారు. ఆ రోజుల్లో అన్ని భాషా చిత్రాలూ చెన్నైలోనే షూటింగులు జరుపుకోవడం వలన ఏ భాషా చిత్రంలోనైనా ఒక నటికి పేరు ప్రఖ్యాతులు వచ్చాయంటే మరో భాషా చిత్రాల దర్శక నిర్మాతలు ఆసక్తి చూపేవారు. అలాగే 'వలయపతి' అనే తమిళచిత్రంలో అవకాశం కలిగింది. తెలుగులో ఎంత మంచి వ్యక్తీకరణతో సంభాషణలు చెప్పేదో తమిళంలోనూ అంతే గొప్పగా సంభాషణలు చెబుతూ అందర్ని ఆశ్చర్యపరిచేది.

చేజారిన దేవదాసు

ఆ రోజుల్లో డి.ఎల్.నారాయణ మంచి వ్యాపార దక్షత గల నిర్మాత, శరత్‌బాబు (బెంగాళీ రచయిత) నవల దేవదాసు చిత్రంగా తీస్తున్నప్పుడు మొదట జానకి కాల్షీట్లే తీసుకున్నారు. తీరా సినిమా మొదలయ్యే నాటికి ఆమె స్థానంలో సావిత్రి ఎంటరయ్యింది. ఇది జానకి జీవితంలో జీర్ణించుకోలేని చేదు నిజం. చిన్న అపార్థం వలన ఒక చారిత్రాత్మక చిత్రంగా నిలిచిన 'దేవదాసు'ని పోగొట్టుకుంది. వేదాంతం ద్వారా సంప్రదింపులు జరిపినా ఫలితం లేకపోయింది. డి.యల్. మహా మొండి మనిషి. అప్పటికి తెరపై అంతగా నటనానుభవం లేని సావిత్రిని కథానాయికగా ఎంపిక చేసి జానకి మీద కసితో ఆ సినిమాలో సావిత్రిని ప్రోత్సహించారు. దేవదాసు చిత్రం సాధించిన విజయాల గురించి చెప్పేదేముంది? ఈనాటికి దేవదాసు ఉదంతాన్ని జానకి మరిచిపోలేదు.

విజయవంతమైన చిత్రాలెన్నో..

పిచ్చిపుల్లయ్య చిత్రం నిరాశ పరిచినా 'రోజులు మారాయి' (తాపీచాణక్య) ఎ.యన్.ఆర్‌తో విజయ బావుటా ఎగురవేసింది. ఎన్నో అవార్డులూ రివార్డులూ ఆ చిత్రం సొంతం చేసుకుంది. యన్.టి.ఆర్‌తో మరో చిత్రం పి.పుల్లయ్య 'కన్యాశుల్కం' (గురజాడ విరచితం) మధురవాణిగా సావిత్రి, బుచ్చమ్మ పాత్రలో జానకి ఎవరి పాత్రకు వారు జీవం పోశారు. కథానాయకుడు యన్.టి.ఆర్ గురించి వేరే చెప్పాలా? పి.పుల్లయ్య

మరో చిత్రం వేంకటేశ్వర మహత్యం గురించి వేరే చెప్పాలా? అందులో ఎరుకలసానిగా కాసేపే కనిపించినా ప్రేక్షకుల హర్షధ్వానాలందుకుంది. 'మంచి మనుషులు' చిత్రంలో, ఇదీ సావిత్రీ కాంబినేషనే, ఎ.యన్.ఆర్. సరసన అంధురాలి పాత్రలో నటించి నిజంగా అంధత్వం ఉందేమో అన్నంత భ్రమ కలిగించింది. మరో చిత్రం అన్నపూర్ణ వారి 'డాక్టరు చక్రవర్తి'. కోడూరి కౌశల్యాదేవి నవలైన ఇదీ సావిత్రి కాంబినేషనే. ఎ.యన్.ఆర్ సరసన అద్భుతంగా నటించింది. 'మంచి కుటుంబం' విక్టరీ మధుసూదన్‌రావు, ఎ.యన్.ఆర్ సరసన 'పాండవులు పాండవులు తుమ్మెద' పాటలో నాటు నృత్యం చేసి ఈలలు వేయించుకుంది. ఏడిద నాగేశ్వరావు 'తాయారమ్మ–బంగారయ్య' చిత్రంలో సత్యనారాయణతో బాటు నటనలో ఒదిగిపోయింది. మరో ఆణిముత్యం లాంటి చిత్రం 'సంసారం ఒక చదరంగం' (ఎ.వి.యంవారిది) ఒక సంచలన విజయం. ఇలా 'శుభాకాంక్షలు', 'బావగారూ బావున్నారా?', 'ఎవడే సుబ్రహ్మణ్యం' వరకు తనను వెదుక్కొంటూ వెళ్లిన ప్రతి పాత్రకీ జీవం పోసింది.

ఇండస్ట్రీకి దూరంగా లేను

నేనెప్పుడూ ఇండస్ట్రీకి దూరంగా లేను. నాకే ఇండస్ట్రీ దూరంగా వుంటోంది అంటోంది చలోక్తిగా. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో రెండువందల పైచిలుకు చిత్రాల్లో నటించింది. వైవాహిక జీవితంలో ఊహించని ఎదురుదెబ్బలు. ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు. ఒక కూతురు ద్వివేదుల విశాలాక్షి కోడలు. విశాలాక్షి కొడుకు చిన్నతనంలోనే మరణించారు. కూతురు జానకి వద్దే వుంటోంది. నలుగురు మనమలు. మరో ఇద్దరు ముని మనమళ్లతో బెంగళూరులో చెల్లితో బాటు వుంటోంది (రాధికా గార్డెన్స్). సినిమాల్లో నటిస్తున్న సమయంలో వారి మధ్య దూరమున్న మాట వాస్తవమే అయినా తర్వాత ఇద్దరూ ఒక ప్రాణంగా వుంటున్నారు. ఇప్పటికీ ఎవరైనా కోరితే వచ్చి చిత్రాల్లో నటిస్తోంది. ఫంక్షన్లకు పిలిచినా ప్రేమగా వచ్చి అందరితో కలుపుగోలుతనంగా ఉంటుంది.

శుచి శుభ్రత ఆమె ఆరోప్రాణం

శుచి శుభ్రతకి జానకి పెట్టింది పేరు. ఆ రోజుల్లో షావుకారు జానకి ఇల్లు షూటింగు కోసం అద్దెకి తీసుకునేవారు. భారీ మొత్తంలో ఖర్చు చేసి ఇంటిని ఎంతో అందంగా తీర్చిదిద్దుకుంటోంది. ఇక ఆమె చేతి వంట సంగతైతే ప్రత్యేకంగా చెప్పుకోవాలి. షావుకారు జానకి వంట ఒకసారి తింటే జీవితంలో మరిచిపోలేరు. కొంతకాలం చెన్నైలో ఫాస్ట్‌ఫుడ్ సెంటరు నడిపించినా వ్యాపార సరళి అలవాటు లేని జానకి దానికి స్వస్తి చెప్పాల్సి వచ్చింది. ఎప్పుడూ కొత్త రకమైన ఆలోచనలు. రేపటి తరానికి మనమేం మిగిల్చాం. ఎటువంటి స్ఫూర్తిని మిగిల్చాం అంటూ ఆంగ్లపత్రికలో కథనాలు రాస్తుంది. బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్‌లో ఉపన్యాసాలు ఇవ్వడం ఆమె ప్రతిభకి తార్కాణం. తెలుగులో ఎన్‌టిఆర్, ఎ.ఎన్.ఆర్, జగ్గయ్య, సత్యనారాయణలతో కలిసి నటించిన ఆమె తమిళంలో ఎం.జి.ఆర్, శివాజీలతో కలిసి నటించింది. కన్నడంలో కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ సరసన నటించింది.

తమిళంలోనే గుర్తింపు

ఎన్ని తెలుగు చిత్రాల్లో నటించినా తమిళనాడు ప్రభుత్వమే ముందుగా గుర్తించి కలైమామ బిరుదుతో ఘనంగా సత్కరించింది. 1984లో లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందిస్తూ ఫిలింఫేర్ అతి వైభవంగా ఫంక్షను చేసింది. 2012 సైమా లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంటు అవార్డుతో సత్కరించింది.షావుకారు జానకి అవార్డులకి అతీతమైంది. తాను చెప్పాలనుకుంది నిర్మొహమాటంగా చెప్పేస్తుంది. చెయ్యాలనుకున్నది చేసేస్తుంది. జీవితం తన కోసం ఇతరుల కోసం కాదంటోంది. శరీరం వేరు మనసు వేరు. మనసు మైల పడకూడదంటుంది. కష్టాలూ సుఖాలూ అన్నింటికీ ఒకేలా స్పందిస్తుంది. అలవాటైపోయిన జీవితం. దీన్ని ఎంజాయ్ చేయడంలోనే జీవిత పరమార్థం వుంది అని ఘంటాపథంగా చెబుతుంది. దటీజ్ షావుకారు జానకి!

- ఇమంది రామారావు
9010133844

'షావు కారు'లో...

'ఎవడే సుబ్రమణ్యం'లో...

మనోరమ, నగేష్‌తో...

సెల్ఫీ డిఫెన్స్

సెల్ఫీలు దిగుతూ ప్రాణాలు కోల్పోతున్నరాన్న వార్తలకు ఇది పూర్తిగా భిన్నం. సెల్ఫీలు దిగేందుకు ఉపయోగించే స్టిక్ పరికరాన్నే ఆయుధంగా చేసుకుని స్వీయ రక్షణ చేసుకునే శిక్షణనిస్తోంది మాస్కోలోని ఎం-పోఫీ అనే మార్షల్ ఆర్ట్స్ సంస్థ. ఎక్కువగా పర్యాటకులు సెల్ఫీ స్టిక్‌లని ఉపయోగిస్తుంటారు. వారిలో ఒంటరి సందర్శకులు మరీను. సెల్ఫీ స్టిక్ బయటకు తీసి ఫొటోలు లాగిస్తున్నాడంటే వీడు కచ్చితంగా బయటోడే అని దొంగలకు అర్థమైపోతోందట. వారి టార్గెట్ కూడా ఆ స్టిక్‌కు తగిలించిన ఖరీదైన మొబైల్ ఫోన్లే. చటుక్కున లాగేసి చిటుక్కున మాయమైపోవడం సెల్ఫీల్లానే విదేశాల్లో ఓ దొంగల ట్రెండ్. ఒక్కోసారి కర్ర చేతికందకపోతే ముష్టిఘాతాలతో టూరిస్ట్‌ల ముక్కు పగలగొట్టేస్తున్నారు. వీరి బారి నుంచి తప్పించుకునేందుకు ఆ సెల్ఫీ కర్రతో సాము నేర్పించేస్తున్నారు ఎం-పోఫీ ట్రైనర్లు. రెజ్లింగ్, బాక్సింగ్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ వచ్చిన వారిని కూడా తేలిగ్గా ఎదుర్కోవచ్చుని అంటున్నారు. శిక్షణకు బానే హాజరవుతున్నారు.

చెడు వాసనకు చెక్ పెట్టే సాక్స్

సాక్స్ ఉతక్కపోతే ఎంత షోకుగా తయారైనా వాటి కంపు వాసనతో ఇరుకున పెట్టేస్తాయి. పాదాల్లో చెమట ఎక్కువవడం వల్లే ఇలా వాసనకొట్టడానికి కారణం. దీనికి పరిష్కారంగా జపాన్‌కు చెందిన ఓ కంపెనీ కొత్త సాక్స్‌లను రూపొందించింది. ఇవేస్తే ఏ ఇబ్బందీ రాదు. చేతికి వేసుకునే గ్లోవ్స్‌లా ఇవి ఉంటాయి. పాదాలకు బిగుతుగా కప్పే ఇవి చెమటను పీల్చి, డియోరెంట్‌గా పనిచేసి, తేమను కంట్రోల్ చేయడమే కాదు అతినీలలోహిత కిరణాలు కూడా పాదాల్ని తాకకుండా చేస్తాయి. 1500 ఏళ్ల నుంచి జపాన్ వాళ్లు వాడుతున్న వాషీ అనే కాగితంతో ఈ సాక్స్‌ను తయారుచేస్తున్నారు. వివిధ మొక్కలు, పిండి పదార్థాల మిశ్రమం, గుజ్జుతో చేసే ఈ కాగితానికి యాంటీ సెప్టిక్, యాంటీ బ్యాక్టీరియా లక్షణాలు ఉంటాయి. సంప్రదాయ కళల్లో బాగా ఉపయోగించే ఈ కాగితానికి కాస్త నునుపుదనం, సాగే గుణం తెచ్చి కొత్త రకం సాఫ్ట్ ఫైబర్‌తో ఈ క్యూర్‌టెక్స్ సాక్స్‌లను తయారు చేసి మార్కెట్‌లో పెట్టేశారు.



వింత లోకం

అబ్బే.. ఇదేం కెఫే!

అని అంటూనే ఓ లుక్కేసొస్తున్నారు మాస్కోవాసులు ఈ క్రేజీ టాయిలెట్ కెఫేలో. గోడల మీద బొమ్మల దగ్గర నుంచి కుర్చీలు, బేబుళ్లు, అలంకరణ వస్తువులు అన్నీ టాయిలెట్‌ల థీమ్‌తో ఉంటాయి. చివరకు వడ్డించే పాత్రలు కూడా మినియేచర్ టాయిలెట్‌లే. పాత్రల మాట అటుంచితే వంటకాల పోలికలు కూడా చాలా చిరాగ్గా ఉంటాయి. వీటిని ఎగబడి కాకున్నా ముచ్చట పడి తింటూ భలే టేస్టీగా ఉన్నాయని చెబుతున్నారు కస్టమర్లు. కాకపోతే మొత్తం వాతావరణమంతా కడుపు కదిలించేలా ఉండటంతో మరోసారి వచ్చేందుకు ధైర్యం చేయడం లేదు. అర్బత్ వీధిలో ఉన్న ఈ టాయిలెట్ కెఫే లాంటిది దక్షిణ కొరియాలో అంతకుముందే మొదలెట్టేశారు. దాన్ని చూసి కాపీ కొట్టినదే ఈ టాయిలెట్ కెఫే!



పాకుడు-పరుగు

ఉదయాన్నే లేచి కసరత్తులు చేయడం మంచి జీవనశైలికి గుడ్ మార్నింగ్ చెప్పడమే. రన్నింగ్, జాగింగ్ అదీ కుదరకపోతే వాకింగ్ ఏదో ఒక ఇంగ్ ఆరోగ్యానికి మంచిదే. కానీ ఇదేంటో క్రన్నింగ్ అట. ఆస్ట్రేలియా అంతటా పాకేస్తోంది. క్రాలింగ్ (పాకటం), రన్నింగ్ (పరుగు)ను కలిపిందే ఈ కసరత్తని ఆ దేశవాసి షాన్ మెక్కార్తీ సెలవిస్తున్నాడు. చెప్పడమే కాక పబ్లిక్‌లో అలా నాలుగు కాళ్ల జంతువుల పరుగు లంఘిస్తూ ప్రచారం చేస్తున్నాడు. నెట్‌కు కూడా ఎక్కించేశాడు. 'కుక్కల్లా, నక్కల్లా, గాడిదల్లా... అదేం నడక!' అని కొందరు నవ్వుతున్నా వైరల్ వెర్రోళ్లు ఫాలో అయిపోతున్నారు. మన శరీర తీరు రెండు కాళ్లపై నడిచేలా పరిణామం చెంది లక్షల ఏళ్లు అయ్యింది. ఇప్పుడు లేనిపోని భంగిమల్లో పరుగులు తీస్తే జాయింట్లు ఊడతాయని వైద్యులు, జిమ్ ట్రైనర్లు పోరుతున్నా పట్టించుకోవడంలేదు. ఏదైనా తీగ తెగితేనో, పట్టేస్తేనో గానీ మళ్లీ రెండు కాళ్ల దారికి రారని అంటున్నారు.



పూమాల దీవులు

మార్కోపోలోకి ఇండియా పక్కన అరవిరిసిన పూవులా కనిపించింది. ఇబన్ బటూటాకి అదో ప్రపంచ వింతలా తోచింది. ఆకాశం నుంచి చూస్తే సముద్రంలో చల్లిన ఓపల్స్‌లా అనిపిస్తాయి. కిందకు దిగి నడక ఆరంభిస్తే నీరు తొణకిన కుండల్లా మరిపిస్తాయి. మాల్దీవుల అందాలకు దాసోహం కాని పర్యాటకుడు ఉండడు. అందునా మాలె మానవారణ్యంలో ఒక్కసారిగా ఆ ప్రకృతంతా ఎలా మాయమైందో తెలియదు.



క్వార్ట్జ్ రేణువులు నిండిన తెల్లటి ఇసుక. లక్షల సంఖ్యలో పోగుబడ్డ గవ్వలు. రాత్రుళ్లు సముద్ర తీరాల్ని పచ్చ నీలాలతో మెరిపించే బ్యాక్టీరియం. ప్రకృతే మంచెకట్టి లగూన్లకు ఐల్యాండ్ హోదా ఇచ్చేసిన అటోల్ నైసర్గిక స్వరూపం వింత. నాలుగు మీటర్ల చిన్న చిన్న ద్వీపాలు చుక్కలు వేసుకోండన్నట్టుండే తీరు. అడుగుల లోతు నీరు మరలుతూ ద్వీపాల రూపాలు మారిపోయే ఆశ్చర్యం. చిన్నచిన్న వాటితో కలుపుకుని 1190కి పైగా దీవుల సముదాయమే మాల్దీవులు. వాటిలో కేవలం 200 దీవుల్లో మాత్రమే జనావాసం. ఊళ్లకు సమాన స్థాయిలో ద్వీప రిసార్ట్‌లు. ద్వీపాలకు ద్వీపాలే రిసార్ట్‌ల్లా మార్చుకున్న ఆ దేశంలో టూరిజానిది జీడీపీలో 26 శాతం వాటా. అలసిపోయిన ప్రపంచ ప్రాణాలన్ని ఇక్కడకొచ్చి ఇసుకలో, నీటిలో చెరో అడుగు వేసి సేద తీరతాయి. కేవలం విశ్రాంతి, ప్రేమ యాత్రల కోసమే వచ్చే పర్యాటకులే ఎక్కువ. వారి విడిది కూడా సముద్రంలో అక్కడక్కడ అలంకరించినట్టుండే రిసార్టుల్లోనే. స్నోర్కెలింగ్‌కు అనువుగా ఉండే సముద్ర తావులు, సముద్రమంతా స్విమ్మింగ్ పూల్ అయినట్టనిపించే ఇన్‌ఫినిటీ పూల్‌లు, స్థానికుల అద్భుతాలైన లక్క ఇళ్లు, ఏకాంతానికి కావాల్సినంత బీచ్ ప్రదేశాలు. ఇంకేం కావాలి సేద తీరేందుకు. ప్రేయసితో, భార్యతో కాలం తెలీని రోజులు గడిపేందుకు. సీప్లేనుల్లో షికార్లు, స్కూబా డైవింగ్, సెయిలింగ్, సర్ఫింగ్‌తో పాటు అనేక జలక్రీడలు ఇక్కడ మామూలు విషయం. చాలా లగ్జరీనిచ్చే ఇక్కడ పర్యటన కూడా అంతే డబ్బును పిండుతుంది. రిసార్టులను ముందే బుక్ చేసుకోవాలి. కానీ, ఓ సారి అక్కడ హృదయాలు లాండైతే అక్కడి అటోల్‌లు దాటి బయటపడలేవు.

అంతా నీరే..

నీటి మీద తామరాకుల్లా తోస్తాయి మాల్దీవులు. మాల్దీవులంటే 96 శాతం నీరే. సముద్ర మట్టానికి కేవలం 1.5 మీటర్ల ఎత్తులో ఉండే ఆ దీవుల్లో చాలా వరకు నాలుగు అడుగుల ఎత్తులోపే ఉంటాయి. గ్లోబల్ వార్మింగ్ వల్ల సముద్ర మట్టం పెరిగితే కొన్ని దశాబ్దాల్లో కనుమరుగయ్యేది తొలుత ఇదేనని శాస్త్రవేత్తల మాట. తమ సమస్య ప్రపంచం దృష్టికి తెచ్చేందుకు వాళ్లు తమ కేబినెట్ మీటింగ్‌ను సముద్రం అడుగున పెట్టుకున్నారు. ఈ దీవుల్లో

విచిత్రంగా తోచేది ఏమిటంటే ముగ్గు చుక్కల్లా వరసగా ఉండే దీవులకు కలుపుతూ వేసిన రోడ్లు. కాస్త దూరం వెళ్లగానే సముద్రం, మళ్లీ కాస్త దూరం ప్రయాణం సాగగానే దీవి. వీటిని వంతెనలూ అనలేము, నీళ్లలో కట్టారు కాబట్టి కాదనీ అనలేము. విమానాశ్రయాలు మొత్తంగా ఒక్కో దీవంతా ఉంటాయి. వాటి రన్‌వేలు సముద్ర ముఖం దగ్గర ప్రారంభమై మళ్లీ సముద్రం చేరువలోనే ముగుస్తాయి. ఇక్కడ ట్యాక్సీలు తిరిగినట్టుగా ఫెర్రీలు తిరుగుతుంటాయి. వాటిలోను ధోనీలనే మాల్దీవుల వాసుల ప్రత్యేక రంగు పడవలు చాలా బాగుంటాయి. కొబ్బరి చెట్ల కలపతో చేసే ఇవి చాలా దృఢంగా ఉంటాయి. చాలా చేపల వేట పడవల్లో జీపీఎస్ అటుంచితే అసలు దిక్సూచిలే ఉండవు. నక్షత్రాలు, సముద్రంలో పొడుచుకు వచ్చినట్టుండే శిలలే గుర్తులుగా వారి ప్రయాణాలు సాగిపోతుంటాయి. కొత్త వారికి పజిళ్లలా తోచే ఆ శిలల్లోని తేడానే వారికి కొండ గుర్తులు. వ్యవసాయానికి కొన్ని ద్వీపాలు, పరిశ్రమలకు కొన్ని ద్వీపాలు ఉన్నట్టే చెత్త వేయడానికి కొన్ని ద్వీపాలను ఉపయోగిస్తారు. ఇపుడిదే అతి పెద్ద సమస్యల్ని తెచ్చిపెడుతోంది. ఉండటానికి 35 వేల చదరపు మైళ్లకు విస్తరించినా మనిషి మసిలేందుకు జాగ ఉంది 116 చదరపు మైళ్ల విస్తీర్ణంలోనే. అందులోను రిసార్ట్‌లు పోగా మిగిలింది చాలా తక్కువ. దానికి తోడు ఏటా తరిగిపోతున్న నేల ప్రాంతం. అందంగా కట్టుకున్న ఇళ్లు, పక్కా ప్రణాళికతో వేసిన మౌళిక వసతులు ముచ్చటగా అనిపిస్తాయి. తాగునీటి కోసం అక్కడి నైసర్గిక స్వరూపమే గొప్ప మేలు చేస్తోంది. సముద్రపు నీటిని 50-60 మీటర్ల లోతుకు మోటార్ల సాయంతో పంపిస్తారు. అవి భూగర్భజలంగా మారి పైకి తీసుకునేటప్పటికీ నేల స్వభావమే ఫిల్టర్‌గా ఉపయోగపడి తాగునీటిని అందిస్తున్నది. 3 వేల ఏళ్ల క్రితమే దక్షిణ భారతానికి చెందిన ద్రావిడ జాతి ఇక్కడ తొలిసారిగా అడుగు పెట్టిందని పరిశోధకుల భావన. వారి తరాలే ఇప్పటి గిరావారు జాతి ప్రజలు. చేపలు పట్టడమే ప్రధాన వృత్తి. ఇస్లాం 12వ శతాబ్ది కల్లా ఇక్కడ ప్రవేశించి మొత్తం ముస్లిం దేశంగా విస్తరించింది. ఇప్పటికీ తమిళులతో పాటు దక్షిణ భారతీయుల సంస్కృతి, ఉచ్చరణ, భాష తీరు, అలవాట్లు స్పష్టంగా కనిపిస్తాయి. తూర్పు ఆఫ్రికా వాసుల జాడలు కూడా ఉంటాయి. ఒకప్పుడు సిల్క్ రూట్‌లో ట్రేడ్ పాయింట్‌గా ఉన్న దీన్ని పోర్చుగీసు వారు ఆక్రమించుకున్నారు. అలా యూరప్ వాసుల వాసనలూ కనిపిస్తాయి. అగ్నిపర్వత పేలుళ్ల వల్ల లావా ఘనీభవించి లక్షల ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ ప్రాంతంలోని వైచిత్రి అయిన అటోల్‌లు ఓ పదం పుట్టుకకు కారణమయ్యాయి. దివేహీ భాష నుంచి ఆంగ్లంలోకి తీసుకున్న ఒకే ఒక్క పదమిది.



మాలెలో దేశమంతా..

మొత్తం జనాభా రెండున్నర లక్షలకు మించని మాల్దీవుల్లో మాలె కేవలం రాజధానే కాదు మొత్తం దేశం అన్నా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. జనాభాలో మూడో వంతు ఇక్కడే ఉంటారు. లక్షన్నరకు పైగా ఉండే జనాభా అంతా ఉండేది కేవలం ఐదున్నర కిలోమీటర్ల కూడా లేని ఆ బుల్లి ద్వీపంలో. ప్రపంచంలోనే అతి జనసాంద్రత కలిగిన ద్వీపాల్లో ఇది ఒకటి. దీని స్కైలైన్‌ను పరికించి చూస్తే ఏదో మహానగరంలోని ఓ ముక్కను విరిచి నీళ్లపై విడిచినట్టు ఉంటుంది. ఎక్కడా కొంచెం కూడా ఖాళీ జాగా లేకుండా సొంతం ఎత్తైన భవనాలతో నిండిపోయిన మాలెలో దారులన్నీ చాలా ఇరుగ్గా సన్నగా ఉంటాయి. మొత్తం నగరాన్ని కొన్ని గంటల వ్యవధిలో నడుస్తూ చుట్టేయొచ్చు. సముద్ర కిరణాలు నిట్టనిలువుగా పడే ఈ ప్రాంతంలో అతినీలిలోహిత కిరణాల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఒకింత ఎక్కువే. సన్‌బర్న్ సమస్య ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి.స్థానికుల కట్టుబాటులకు తగ్గట్టుగా శరీరాన్ని ఎక్కువ భాగం కప్పేలా ఉండే దుస్తుల్ని ధరించాలి. మహిళా పర్యాటకులు దుస్తుల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. స్థానికుల కట్టు బాటును గౌరవిస్తూ శరీరాన్ని పూర్తిగా కప్పే విధంగా ఉండే ఆహార్యం మంచిది. మద్యం, రెచ్చగొట్టేలా ఉండే బొమ్మలున్న వస్తువుల్ని, దుస్తుల్ని, ఆ చిత్రాలున్న పుస్తకాల్ని కూడా అనుమతించరు. బికినీలతో ఉండే చిత్రాలు కూడా ఇబ్బంది తెచ్చిపెట్టేవే. అయితే రిసార్టుల్లో మాత్రం కుదిరితే పాశ్చాత్య పర్యాటకులు వాటిని ధరించొచ్చు. ఇతర మతాలకు చెందిన చిహ్నాలు, గ్రంథాలు వెంట తీసుకెళ్లడానికి అనుమతి తప్పనిసరే. తూర్పు నుంచి పశ్చిమానికి సొంతం దీవిని చీల్చినట్టుండే వీధి మార్కెట్ మజీదీ మగు, బోదూతాకురుఫాను మగు మార్కెట్, చాందాని మగు, భారీ చేపల మార్కెట్, కూరగాయల మార్కెట్‌లు కూడా ప్రధాన ఆకర్షణలే. వస్తు మార్కెట్‌లలో మినియేచర్ ధోనీ పడవులు, గవ్వలు, లక్క వస్తువులు, పగడాల అలంకరణలు బాగా అమ్ముడుబోతాయి. భారతీయ సినిమాలని అభిమానించే మాల్దీవ్ వాసుల వినోదానికి ఏథెనా వంటి సుందరమైన థియేటర్లు కూడా ఉన్నాయి. వేల్ సబ్‌మెరీన్ రైడ్ సముద్ర అంతర్భాగంలో ఉన్న జీవ విశేషాల్ని కళ్లకు కడుతుంది. విల్లింగ్లీ దీవి కూడా రాజధాని బరువును మోస్తోంది. ముల్లీయాగే అధ్యక్ష భవనం, మెడూ జియారత్ ప్యాలెస్, సుల్తాన్ పార్కు, మ్యూజియం భవనం చూడదగినవి. ఒకప్పుడు ఇక్కడివే 30 ప్రాచీన బుద్ధుడి విగ్రహాలు మ్యూజియంలో ఉండేవి. వాటిని ఛాందస వాదులు ధ్వంసం చేశారు.





1656కు చెందిన హుల్కురూ మిస్కీ (ఫ్రైడే మాస్క్) మసీదు చారిత్రక సంపద. కోరల్ కట్టడంతో, లక్క కార్వింగ్‌లతో లోపలి భాగం చూపు తిప్పుకోనివ్వదు. ఇదే కాక స్వర్ణపు డోమ్ ఉన్న మసీదు కూడా సందర్శనీయమే. కొబ్బరికి అధిక ప్రాధాన్యం ఇచ్చే వీరి వంటకాలు దక్షిణ భారత వంటకాల్ని పోలి ఉంటాయి. రిహా, రోషి అనే రొట్టె, కూరల విందు గానీ, కుల్హీ బోవాకిబా అనే చేప కేక్ కానీ, గుల్హా అనే ఫిష్ బాల్స్ వంటకం కానీ నోరూరిస్తాయి. బజ్జియా అనే చేపల స్నాక్ మన సమోసాలా ఉంటుంది.

మాలెకు చేరుకోవడానికి పక్కనే ఉన్న మరో హులుహులే కృత్రిమ దీవే ప్రధాన విమానాశ్రయం. అక్కడి నుంచి ఫెర్రీలో కేవలం పది నిమిషాల్లో ప్రధాన నగరానికి చేరుకోవచ్చు. చాలా మంది పక్కనే ఉన్న హుల్హిమాలేలో దిగుతారు. ఎక్కువగా పర్యాటకులు కాపు ప్రాంతంలోను విడిది చేస్తారు. ఇక్కడ మోస్తరుగా అద్దె రేట్లు ఉంటాయి.

అజయ్ కుమార్ వారాల

◆ కథ

గమనం

డా॥శమంతకమణి



మండుతున్న కళ్ళు, రెప్పలని పైకి లేనివ్వడం లేదు. మంచంపై ప్రక్కకు ఒత్తిగిల్లాడు రాజు. కొడుకు కదలికను గమనించిన విజయ, ఉదయం భర్తకు కాసిన టీ మరోసారి వేడిచేసింది. స్టీలు గ్లాసులో పోసి కొడుకు ప్రక్కన కూర్చుని తల నిమిరింది. తల్లిపాదాల చప్పుడుతో ఆమె రాక గమనించినా, కళ్ళు తెరవని రాజుకి ఆమె స్పర్శతో లేవక తప్పలేదు. టీ గ్లాసు చూసిన వెంటనే గిర్రున కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఐదవ తరగతిలో మొదటి ర్యాంకు సాధించినందుకు లభించిన బహుమతి అది. మొదటి గ్రుక్కకే మత్తు వదిలినట్లయింది. చక్కెర తక్కువగా ఉంది. పాలు, టీ పొడి తక్కువైనా చక్కర వుంటే ఆ లోపాలు కొట్టుకుపోతాయన్నది వ్యాపారస్తులకు తెలిసిన కిటుకు. కానీ ఇది ఇల్లు. బహుశా పచారీ సరుకులు నిండుకున్నట్లున్నాయి. రాత్రి కూడా అన్నంలోకి రసం మాత్రమే చేసింది తల్లి. ఓ నిట్టూర్పు వెలువరిందతనిలో!

'రాజు 11 గంటలకల్లా సర్టిఫికెట్లు తీసుకుని షాపుకి రమ్మని చెప్పారు మీ నాన్న" గ్లాసు అందుకుంటూ అంది విజయ. తలెత్తి చూస్తే గడియారం పది గంటలు చూపిస్తుంది. లేవలేక తప్పలేదు అతనికి.

తన బాల్యం నుండి ఇంటిలో ఏ మార్పులేదు. ఒకే గది, ఒకే లైటు, ఒకే ఫ్యాను. "దీపం పథకం"లో వచ్చిన గ్యాస్ స్టవ్. ఇండక్షన్ కుక్‌వేర్ కొనుక్కుని పాత సామాన్లు వదిలించుకుంటూ , అమ్మ వంట చేసే ఇంటి యజమానురాలిచ్చిన వంట పాత్రలు మినహా.. అదే జీవితం.

అక్షర జ్ఞానం లేని తల్లిదండ్రులకు పుట్టిన ఏకైక సంతానం తను. ఇంజనీరింగ్ పట్టా పొందాడు. అగ్రకులంలో పుట్టినా, ఆర్థికంగా అత్యంత హీనస్థాయి. మొదటి నుండీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువు. స్కూల్లోనే కాక, బంధువుల పిల్లల్లో సైతం చదువులో రవి మేటి. ఆర్థిక పరిస్థితి సహకరించని కారణాన క్యాంపస్ ఇంటర్వ్యూలున్న విద్యాసంస్థలో చదవలేకపోయాడు. తెల్లరేషన్ కార్డ్ ద్వారా ఉన్న ఊరిలోనే కాస్త మంచి కాలేజీలో చదవగలిగాడు. ఈ జీవన విధానం ఇక్కడితో ముగిసిపోవాలి. తమ కుటుంబ ఆర్థికస్థితి మారాలంటే తాను మంచి ఉద్యోగంలో చేరాలి. లేకుంటే ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లుగా పరిస్థితి మారదు. అప్పుడప్పుడు కొందరు పెద్దలు స్వచ్ఛంద సంస్థల సహకారం వలన వచ్చిన నగదు...పుస్తకాలకు, బట్టలకు ఉపయోగపడేది.

బట్టలు జ్ఞాపకం రాగానే ఎదురుగా హ్యాంగర్‌కి వేలాడుతున్న ప్యాంట్‌ని చూశాడు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ఎంతో మక్కువతో కొనుక్కున్న జీన్స్‌ప్యాంట్ అక్కడక్కడ వెలసి, చిన్న ప్యాచ్‌లతో ఉంది.

బాల్యంలో తండ్రికి చదువు వంటబట్టక పోయినప్పటికీ, టైలరింగ్‌లో మాత్రం క్రమంగా నైపుణ్యం సాధించాడు. తన దగ్గర బట్టలు కుట్టించుకునే వారి వద్ద మిగిలిన ముక్కలను రకరకాలుగా మార్చి రెడీమేడ్ ఫ్యాషన్ దుస్తుల్లా కుట్టేవాడు రవి కోసం.

ఇంజనీరింగ్‌లో జాయిన్ అయిన తర్వాత సాటివారితో నామోషీగా అన్పించి, ఆర్థిక భారమైనప్పటికీ పట్టుపట్టి సంవత్సరానికి రెండు జీన్స్ ప్యాంట్‌లు చొప్పున మొత్తం ఎనిమిది కొన్నాడు.

కొడుకు ఏదో ఆలోచనలో ఉండటం గమనించిన విజయ "మీ నాన్న రమ్మన్న విషయం మరచిపోయావా"? అంటూ గుర్తుకు చేసింది. అనివార్యంగా లేచి.. పెరడువైపుకి వెళ్ళాడు. కాల్వ గట్టునున్న ఇంటికీ, నీళ్ళులేని కాల్వకీ మధ్య ఉన్నకాస్త జాగాలో ఎండకీ, వానకీ రక్షణ లేకున్నా, గట్టిగా తోస్తే ఊడిపోయే తలుపుతో వున్న బాత్రూమ్ కమ్ లెట్రిన్. చల్లటి నీళ్ళ ఒంటికి హాయిగా అన్పించాయి.వేడి నీళ్ళ ఊసు ఏ కాలంలోనూ లేదు. కడుపులోకి సరైన ఆహారం లేని కుటుంబాలలో వేడి నీళ్ళ కూడానా? తన అభిమాన నాయకుడి సినిమాలలోగా మంచి షవర్ బాత్ వున్న బాత్రూమ్ వుంటే బావుండునని చాలాసార్లు అన్పించింది. ఆర్థికస్థితి మారందే ఆశలు తీరవు. ఆకాంక్షలు నెరవేరవు.

స్నానం ముగించిన కొడుక్కి అన్నం పళ్లెం అందించింది విజయ. కొద్దిగా పచ్చడి, కొంచెం కూర బహుశా ఉదయం వంట చేసి వచ్చేటప్పుడు అమ్మకి

ఇచ్చినని అయ్యుంటాయి. పావుకేజీ ఖైమా కూర పళ్లెం నిండా కలుపుకుని ఒక్కడే తినాలన్న కోరిక ఏనాటిదో అమ్మకి ఎప్పుడూ చెప్పలేదు. చెప్పి ఉంటే ఎలాగైనా తీర్చేది కానీ చెప్పలేకపోయాడు.

కారణం రెడీమేడ్ దుస్తుల తయారీ వ్యాపారం బాగా అభివృద్ధి చెందడం, మోటారు సహాయంతో నడిచే కుట్టు మిషన్లు వచ్చిన తర్వాత తండ్రికి ఆదాయం తగ్గిపోయింది. కుట్టుకూలికిచ్చే సొమ్ముకి నామమాత్రం కలిపితే రెడీమేడ్ బట్టలు వచ్చేస్తున్నాయి. గతంలో ఒక జత బట్టలు కుట్టించితే కొన్ని సంవత్సరాలు వాడేవారు. కానీ నేడు "యూజ్ అండో త్రో" అన్న పద్ధతిలోకి సమాజం మారిపోతోంది.

"ఇక నువ్వు హైదరాబాద్ వెళ్లనట్లేనా?" తల్లి ప్రశ్నకి తలెత్తి చూశాడు. విషయం తెలసి కూడా ఎందుకడిగిందో అర్థం కాలేదు...." వద్దన్నారుగా. ఇక అవసరం లేదు.

"ఏమిటో రాజు... ముప్పై సంవత్సరాల నుండీ మీ మేనత్త వాళ్ళు అక్కడే స్థిరపడిపోయారు. ఆ మాటకొస్తే అందరూ ఎప్పుడో ఒకప్పుడు వలసి వెళ్ళినవాళ్ళే. అన్నదమ్ముల్లా విడిపోవడం అంటూనే ఆస్తుల పంపకాల నుండీ, నేటి పంపకాల వరకూ ఒకటే గొడవలు. దేశ పౌరసత్వం నుండి భారతీయులుగా గుర్తింపబడుతున్నాం. కానీ ఉద్యోగాల విషయంలోనే నీ రాష్ట్రం, నా రాష్ట్రం, నీ ప్రాంతం, నా ప్రాంతం అంటూ ఒకటే తగవులు. అన్నీ బావుండి వుంటే ఉద్యోగంలోకి చేరి ఆరునెలలై పోయేది" నిట్టూర్చింది విజయ.

తింటున్న అన్నం చాలనిపించింది రాజుకి. కడుపు పూర్తిగా నిండలేదు. కానీ ఆవేదనాకెరటం అతని ఆకలిని చంపేసింది. ఆ రోజు జ్ఞాపకం కళ్లల్లో మెదిలింది.

అపాయింట్‌మెంట్ లెటర్ అందుకున్న ఆ రోజు... రాజు.... నిజంగా "రాజే" అయ్యాడు. తల్లీదండ్రీ ఆనందంతో ఉప్పొంగిపోయారు. నెలకు పద్దెనిమిది వేల రూపాయల జీతం చాలా పెద్ద అంకె ఆ కుటుంబానికి తొలి జీతంలో అమ్మకి ఓ మంచి చీర, తండ్రికి మోటారున్న టైలరింగ్ మిషన్ కొని ఇవ్వాలనుకున్నాడు.

జాయినింగ్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ తల్లికి ఒకటే హడావుడి. కొడుకుకు ఏమేం ఇవ్వాలా? అని. తెలిసిన మిత్రుడి ద్వారా ఓ బ్యాగ్ కుట్టించాడు తండ్రి. నాలుగు జతల బట్టలు. రెండు దుప్పట్లతో ప్రయాణంలో తలగడలా సౌఖ్యంగా అమరిపోయింది.

మరో రెండు రోజుల్లో ప్రయాణం. తనతోపాటుగా ఉద్యోగంలో చేరబోతున్న ప్రియ సఖి, పావనిని కలుద్దామని బయలుదేరాడు. కాలింగ్ బెల్ శబ్దానికి తలుపు తీసి ఆమె వదనంలో వెలుగు లేదు. తనని చూసిన ప్రతీసారీ కళ్లల్లో కన్పించే సంతోష ఛాయలు ఎందుకు లేవో అర్థం కాలేదు రాజుకి.

ఇద్దరికీ టీ తెచ్చిన పావని...తాగడం అయిన తర్వాత నోరు విప్పింది... "మనం మోసపోయాం రాజు"అంది ఎందుకో అర్థం కాని రాజు కనుబొమ్మలు ప్రశ్నార్థకంగా పైకి లేచాయి.

"కంపెనీలోకి నూతన ఆర్థిక విధానాల వలన ఉద్యోగులను తగ్గించుకుంటూ నిర్ణయం తీసుకుని, మనకిచ్చిన ఆఫర్ లెటర్ రద్దు చేస్తున్నాం" అంటూ నిన్న ఈ-మెయిల్ పంపారు. సారాంశం అర్థం అయినా ఆశ చావక ఆ కంపెనీ మేనేజర్‌కి ఫోన్ చేశాను. ఆర్థిక పరమైన విషయం కాదని, రాష్ట్ర విభజన వలన ఆంధ్రులను, తెలంగాణలో ఉద్యోగంలో చేరకుండా చేస్తున్న ప్రయత్నమని ఆ విషయం చెప్పలేక ఇలా చెప్పారట."



కాలేజీలో తాము చదువుకునేటప్పుడు రాష్ట్రం సమైక్యంగా ఉండటం వలన వచ్చిన అవకాశం, విభజన వలన చీలికలు భౌగోళికంగా తీసుకురావడమే గాక ఉద్యోగవకాశాలను కూడా లాగేస్తుందా? ఆలోచనల్లో ఉన్న రాజు తన పరిస్థితి ఏమిటా? అని ఆలోచన, భయం ఏకకాలంలో కలిగాయి. చేసేదేమీలేక మౌనంగా ఉండిపోయాడు.

"ఎందుకైనా మంచిది నువ్వు కూడా ఓ సారి ఫోన్ చేయరాదు?" అన్న పావనితో "నాకు సమాచారం లేనపుడు ఎందుకు తొందరపడటం? అంటూ లేచి బై చెప్పి బయలు దేరాడు. ఇంటర్‌నెట్ సెంటర్ చేరి మెయిల్ ఓపెన్ చేస్తున్నప్పుడు మౌస్‌పై చేయి వణికింది. నిజమైన ఓ కన్నీటి బొట్టు బుగ్గపై జారింది. ఫోన్ చేయడం ఖర్చు దండగ అనుకుంటూ ఇంటికి చేరాడు. ఆశలను, ఆకలిని అణచుకోవడం అతనికి అలవాటే అయినా ఈ సారి తీవ్ర అశనిపాతం కలిగింది."

మౌనమునిలా వున్న కొడుకుని చూసి తమను వదిలివెళ్లటానికి దిగులు పడుతున్నాడనుకుంది... లాలనగా "అన్నం పెట్టనా రాజు" అన్న తల్లితో "నాన్నని కూడా రానీయమ్మా" అన్నాడు. మాటల్లోనే తండ్రి వచ్చాడు.

"రాజూ ప్రయాణంలో బట్టల బ్యాగ్ కన్నా సర్టిఫికెట్స్ ఫైల్ జాగ్రత్త ....కలర్ జిరాక్స్ ఒక సెట్ తీయించి ఇంట్లో ఉంచితే మంచిదట" అంటున్న తండ్రితో "నాన్నా" అంటూ చేజారిపోయిన ఉద్యోగవకాశం గూర్చి చెప్పేశాడు.

తనకన్నా ఉన్నత సంపాదనాపరుడవుతాడనుకున్న కొడుకు నిరుద్యోగిగా మిగులుతున్నాడని అర్థం అయినా, జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న ఆ తండ్రి "ఫరవాలేదు రాజు. అన్నీ మన మంచికే! నిన్ను పంపడానికి మీ అమ్మ ఎంతో దిగులు పెట్టుకుంది. ఇది కాకపోతే మరో ఉద్యోగం దొరుకుతుందిలే" అంటూ పైకి అన్నాడు కానీ అతని అంతరంగం దు:ఖ భాజితమైపోయింది.

హైదరాబాద్‌లో కంపెనీలు ఎక్కువగా ఉండటం వలన ప్రభుత్వేతర సంస్థల్లో ఉద్యోగాలు దొరకడం సులభంగా ఉండేది. రాష్ట్రం విడిపోయింది కొత్త ఫ్యాక్టరీలు ఎప్పుడొచ్చేను? ఉపాధి అవకాశాలు ఎప్పటికి పెరిగేను? తనకా సమాజంలో పెద్దలతో పరిచయాలు పెద్దగాలేవు. ఎవరో ఒకరిని అడగాలి. తప్పదు. మనస్సులో అనుకొని పైకి మాత్రం

"విజయా...రాజుకి డబ్బులివ్వు సినిమాకు వెళతాడు" అంటూ భోజనం ముగించి వెళ్లిపోయాడు.

తండ్రి ఆంతర్యం అర్థమయినా అదో ఖర్చు ఎందుకనుకుంటూ మంచంపై నడుం వాల్చాడు. రకరకాల ఆలోచనలు....చేతికి అందినట్లే అంది చేజారిన అవకాశం. ఉద్యోగం వస్తే తమ ప్రేమ విషయం ఇంట్లో చెబుదామనుకున్నారు పావనీ, తనూ అనుకున్నదొకటి, జరిగిందొకటి, ఇంటర్నెట్ ఆధారంగా ఉద్యోగాలు వెతకడం ప్రారంభించాడు. పార్ట్ టైం జాబ్‌లు ఉంటున్నాయి కానీ అతని ఉద్యోగార్హత ఎక్కువ అవ్వడం అడ్డంకిగా మారుతోంది. పావనీ పరిస్థితీ అదే! తల్లిదండ్రులను సుఖపెట్టాలనుకున్న తరుణంలో వారికి మరింత భారంగా తయారయ్యానని బాధపడుతూ రాత్రిళ్ళు నిద్రకు దూరం అవుతున్నాడు. ఉదయాన్నే తండ్రి మొహం చూడటానికి ఓ గిల్టీ ఫీలింగ్ ...ఆరు నెలలుగా నిరాశా నిస్పృహలు వెంటాడుతూనే ఉన్నాయి రాజుకి.

"మీ నాన్న సర్టిఫికెట్స్ తీసుకురమ్మన్నారు" మరలా గుర్తు చేసింది తల్లి. లోకల్‌గా వున్న బనియన్ ఫ్యాక్టరీలో సూపర్ వైజర్ కమ్ అకౌంటెంట్ ఉద్యోగం కోసం వెళ్ళబోతున్న రాజుకి "చదివిన చదువుకి తగిన ఉద్యోగం కాదు" అన్న భావన గుండెల్లో ఉన్నా... తప్పనిసరై బయలుదేరుతున్నాడు.

లుంగీ మార్చి జీన్స్ వేసుకోవడానికి ప్యాంట్ అందుకున్న రాజు ..ఆ ప్రక్కనే తన ప్రయాణం కోసం తండ్రి తెచ్చిన బ్యాగ్‌ని చూశాడు. బ్యాగ్‌ని, పాత జీన్స్‌ని చూసిన రాజుకి ఓ ఆలోచన తట్టింది. ఆలోచనల సుడులు సర్టిఫికెట్స్ తీసుకుని తండ్రి వద్దకు వెళ్ళి "నాన్నా" అంటూ తన ఆలోచనను పంచుకున్నాడు. వింటున్న తండ్రికి కొడుకు ఆలోచనపై నమ్మకం కలిగింది. కానీ నమ్మకానికీ, వాస్తవానికీ దూరం భూమ్యాకాశాలంత... అందుకే

"ముందు ఆ ఫ్యాక్టరీకి వెళ్ళి వద్దాం... తర్వాత ఆలోచిద్దాం" అన్నాడు రాజు సర్టిఫికెట్లు చూసిన ఆ యజమాని ఓ పదిహేను రోజుల తర్వాత ఓ విషయం చెబుతానన్నాడు. ధన్యవాదాలు చెప్పి ఇంటి దారిపట్టిన ఆ తండ్రీకొడుకుల మనస్సులో నాటుకున్న చెట్టయ్యింది. ఫ్యాక్టరీ వాతావరణం రాజు ఆలోచనకు మరింత బలాన్ని, తండ్రికి నమ్మకాన్ని పెంచింది.

ఆ మర్నాడు ...తండ్రి కుట్టిన బ్యాగ్‌ని పావని చేతిలో ఉంచి "తొలి బ్యాగ్ నీకే" అన్నాడు. పాత జీన్స్‌ని అందంగా కట్‌చేసి "పావనీ" అన్న పేరుని ఎంబ్రాయిడరీ చేయించిన ఆ బ్యాగ్ చూసిన పావని తల్లి ఐదువందల రూపాయలు రాజు చేతిలో ఉంచి "తొలి బోణీ నాదే అల్లుడు" అంది ఆ పిలుపు వినగానే రాజు మనస్సు జల్లుమంది. అంటే పావని ఇంట్లో ఎలాంటి అభ్యంతరాలు లేవు. కళ్ళెత్తి పావనిని చూశాడు. ఆమె మోములో ఆనందాతిశయం. సంతోషంగా వెనుదిరిగాడు రాజు. కారణం తన తల్లిదండ్రులు వైపు నుండీ ఎలాంటి అభ్యంతరాలుండవు.

మరో సంవత్సరం తర్వాత పాత జీన్స్ కలెక్ట్ చేస్తూ విజయమ్మ ఇంటర్నెట్‌లో డిజైన్‌లు డౌన్‌లోడ్ చేస్తూ పావనీ.. క్యారేజీ బ్యాగ్‌లు, లేడీస్ హ్యాండ్ బ్యాగ్‌లు, ట్రావెల్ బాగ్‌లు మరో సహాయకుడితో తయారు చేస్తూ తండ్రి... మార్కెటింగ్ చేస్తూ రాజు విజయ బ్యాగ్స్ విజయవంతంగా నడుస్తోంది. షాపు ఇల్లు కలిసివుండేలా నగర శివార్లలో ఓ స్థలం కోసం రాజు పావనీ వెతుకుతున్నారు. ప్రస్తుతం

రాజూ! మనం చదివిన చదువు ఏంటి? చేస్తున్న పని ఏంటి అంటూ వివాహమైన తొలి రోజుల్లో పావనీ అడిగిన ప్రశ్నకు... సమాజావసరాలకు అనుగుణంగా జీవనోపాధి కల్పించుకుంటూ మనలను నడిపించేదే చదువు పావనీ... మన విద్యార్థి జీవితానికీ. నేటి ఆర్థికస్థితికీ ఎంత తేడా! ముందు నడిచేవాడు ముళ్ళకు భయపడితే దారి ఏర్పడదు. నలుగురికీ ఆదర్శమవడం! ఏం చదివాం అన్నది కాదు.ఎలా జీవితాన్ని నడుపుకుంటున్నాం అన్నదే ప్రధానం. గమ్యం చేరాలంటే గమనం ముఖ్యం అంటూ పావనిని దగ్గరకు తీసుకున్నాడు ఆమె భర్త.

✦

రైతు లోక బాంధవుడు

రైతు లోక బాంధవునకు
నత మస్తక వందనాలు
ఉద్యమాల యోధునికి
అక్షర నీరాజనాలు

పాత తరం వామపక్ష
నేతలలో అతడు మేటి
త్యాగ గుణపు తూకంలో
ఎవడయ్యా! అతని సాటి?

దుక్కి దున్ను రైతన్నే
దేశానికి అన్నదాత
నేటి కాలమందు అతని
బతుకంతా గుండె కోత

రైతు ఉద్యమాలలోన
రాటు తేరె మన రామం
అతనెప్పుడూ ఆశించెను
సామాన్యుని సంక్షేమం

అతని జీవితాన ఎపుడు
కనిపించదు స్వార్థ గుణం
ఉద్దరాజు రామమంటే
నుసి కట్టని నిప్పు కణం

అదర్శపు కామ్రేడుకు
అర్పిద్దాం జోహారులు
ఎన్న తగిన అతని చరిత
తలపోద్దాం పలుమారులు.

- ఈదుపల్లి వెంకటేశ్వరరావు

సెల్ 9603933664



జత చేద్దామా

ఇక్కడ ఆరుగురు పిడుగులు ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌కి ఇలా చిత్ర విచిత్ర వస్త్రాలతో రెడీఅయి వచ్చారు. అయితే వాళ్ల నీడలు కూడా కింద వున్నాయి. ఎవరి నీడ ఏదో కనిపెట్టి జత చేసేయాలి మరి.



లెక్క తేల్చండి

ఇక్కడ కొన్ని అంకెలు, గణిత గుర్తులు వున్నాయి. ఈ గుర్తుల ఆధారంగా ఖాళీలను పూరించండి. ఆఖరికి మా జవాబును ఒకసారి చూడండే. మరి మీరు రాసింది రైటో రాంగో తెలియాలి కదా.

6	+		−		=	3
+	+	x		+		
	x		/		=	20
+		−	+	−		
	x		+	9	=	12
=		=		=	=	
15		17		0		20

బుజ్జి స్టార్



హాయ్ ఫ్రెండ్స్! నేను తెలుగు సినిమా హీరోను. ఆ... 'గమ్యం, అమ్మ చెప్పింది' సినిమాలు చూస్తే నన్ను ఈజీగా గుర్తుపట్టేయొచ్చు. ఇది నా చిన్ననాటి ఫోటో...నేనెవరో గుర్తించండి.

పదేళ్ల పిల్లాడు

850 మంది ప్రాణాలు కాపాడాడు

సిద్దేష్ మంజునాథ్ మీలాగే బడి పిల్లవాడు. దేవనాగర నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. చదువులో అంత చురుగ్గా ఏమీ వుండడు. వాళ్ల నాన్న తమ సొంత ఊళ్లో టీ కొట్టు నడుపుతుంటాడు. సిద్దేష్ ఎక్కువగా అక్కడే వుంటుంటాడు. రైల్వే ట్రాక్‌కి దగ్గరగానే వుంటుందా దుకాణం. దాంతో వచ్చే పొయ్యే రైళ్లను పరిశీలిస్తుంటాడా చిన్నారి. మార్చి 14, 2015వ తేదీన కూడా ఎప్పటిలాగే టీస్టాల్ దగ్గర కూర్చుని రైళ్లను చూడసాగాడు. ఎందుకో అటుగా వెళ్లిన రెండు రైళ్ల శబ్దం తేడాగా అనిపించింది వాడికి. అదే వాళ్ల నాన్నతో కూడా చెప్పాడు. 'ఆ... అది ట్రాక్ మీది రాళ్ల శబ్దాలై వుంటాయి' అంటూ కొడుకు మాటలను తేలిగ్గా కొట్టిపారేశాడు. ఆయన మాటలు వాడిని కుదురుగా కూర్చోనివ్వలేకపోయాయి. ట్రాక్ మీదకెళ్లి చెక్ చేస్తుంటే ఒకచోట రెండు అంగుళాల మేర పగులు కనిపించింది. దానివల్లనే ట్రాక్ మీదగా రైలు వెళ్లినప్పుడు శబ్దం తేడాగా వచ్చిందని తెలుసుకున్నాడు. తండ్రితో చెప్పగా...ఆయన స్థానికులను పోగుచేసి అందరినీ హెచ్చరించసాగాడు. ఈలోగా ఎదురుగా హరిహర చిత్రదుర్గ రైలు వస్తూ కనిపించింది. అది ప్యాసెంజర్ రైలు. పగుళ్లిచ్చిన ట్రాక్ వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే అంతమంది ప్రాణాలకూ ప్రమాదం వుంటుందని భావించారు. ఏదో ఒకటి చేసి రైలును ఆపాలనుకున్నాడు సిద్దేష్. బాగా ఆలోచించగా ఒక అద్భుతమైన ఉపాయం తోచింది. తన వంటిమీదున్న ఎరుపు రంగు టీషర్టు తీసి ఊపుతూ పరుగెత్తుకుంటూ రైలుకు ఎదురు వెళ్లాడు. ప్రమాదమేదో వుండి వుంటుందనుకున్న రైలు సిబ్బంది బండిని ఆపేశారు. ఇంతకీ ఆ రైల్లో ఎంతమంది వున్నారో తెల్సా! 850 మంది. అలా కథ సుఖాంతమైంది. ప్రమాదం జరుగుతుందని తెలిసినప్పుడు భయపడి పారిపోకుండా దానినుంచి ఎలా బైటపడాలో ఆలోచించడమే కాదు. దాన్ని ఆచరణలో చేసి చూపించడంలో అద్భుతమైన ధైర్య సాహసాలు ప్రదర్శించాడు చిన్నారి సిద్దేష్. అందుకుగాను కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బాలల దినోత్సవంనాడు ఆ బుడతను సాహస బాలల అవార్డుతో సత్కరించింది.

ఇదేదో తేడాగా వుందే...

ఇక్కడ మూడు రకాల జంతువులు గుంపుగా ఉన్నాయి. చూడ్డానికి అన్నీ ఒకేలా ఉన్నా ప్రతి వరుసలోనూ ఒకటి మాత్రం తేడాగా ఉంది. వాటిని కనుగొనండి.



పదాలను పూరించండి

తెలుగులో కొన్ని పదాలిచ్చాం. వాటిని ఇంగ్లీషులో ఏమంటారో మీకు తెలిస్తే ఈ పజిల్‌ను పూరించడం చాలా సులభం. ఆధారాల కోసం పక్క గళ్లను పరిశీలించండి.

1. గాలి H A I R
2. ఎరుపు R E A D
3. చెవి Y E A R
4. బొజ్జము W H O L E
5. వాన
6. రాత్రి
7. లాభపడు

జవాబులు: బుజ్జిస్టార్: శర్వానంద్, లెక్క తేల్చండి: పై వరుస నుంచి కిందకు (4,7), (8,5,2), (1,3,) పదాలను పూరించండి: (t)rain,(k)night,g(r)ain

జిరాఫీ బంధువునండీ...



కాళ్ల మీద గీతలు చూడటానికి జీబ్రాలా ఉన్నా జిరాఫీకి దగ్గరి బంధువులీ ఒకాపీలు. ఆఫ్రికాలోని రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎక్కువగా కనిపించే ఈ జంతువులు చాలా విలక్షణమైనవి. చాకొలెట్, ఎర్రని గోధుమ రంగులో దేహం ఉంటుంది. ముఖం చూస్తే జిరాఫీలా తోస్తుంది. సముద్ర మట్టానికి 500-1500 మీటర్ల ఎత్తులో ఉండే అటవీ ప్రాంతాల్లో సంచరిస్తాయి. పాతికేళ్లకు పైగా జీవించే ఇవి క్రమంగా కనుమరుగవుతున్నాయి. అడవుల నరికివేతే ప్రధాన కారణం.

- 1.5 మీటర్ల ఎత్తు, 2.5 మీటర్ల పొడవు ఉండే ఇవి 200-350 కిలోల బరువు తూగుతాయి.
- పొడవాటి మెడ, చెవులు ఉండే ఇవి చిన్న చప్పుడును ఇట్టే పసిగట్టేస్తాయి.
- మగవాటికి 15 సెం.మీ. కొమ్ములు ఉంటాయి.
- మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎక్కువగా గడ్డి మేసే పనిలో ఉండే ఇవి రోజుకు 30 కిలోల ఆహారాన్ని ఆరగించేస్తాయి.
- వీటి కళ్లలోని రెటీనాలో ఎక్కువ రాడ్ కణాలుండటం వల్ల రాత్రుళ్లు కూడా మెరుగ్గా చూడగలవు.
- మిగతా జంతువులకు, మనుషులకు వినబడనంత మంద్ర శబ్దాలతోనూ మాట్లాడుకుంటాయి.
- వేటాడే జంతువుల నుంచి తప్పించుకోవడానికి ఈ రకమైన ఇన్‌ఫ్రాసోనిక్ అరుపులు చక్కగా ఉపయోగపడతాయి.
- వీటి పాదాల్లో ఉన్న గ్రంథులు ఓ చిక్కని ద్రవాన్ని దారిన పోయేటపుడు స్రవిస్తూ ఉంటాయి.
- దీని వాసన ద్వారానే అవి తమ దారిని గుర్తుపెట్టుకుంటాయి.
- మరో ఒకాపి తమ స్థావరంలో ఉందనే విషయాన్ని ఇలాగే పసిగడతాయి.
- ఎదుటి ఒకాపిలను ఆకట్టుకునేందుకు ఇవి ముస్తాబు కావడం కూడా నేర్చుకుంటాయి. తమ మెడ, చెవుల్ని చెట్లకు రుద్ది గోధుమ రంగులో మచ్చలు ఏర్పడేలా చేసుకుంటాయి.
- చర్మం మెరిసేలా ఎప్పటికి అప్పుడు నాలుకతో పాలిష్ చేసుకుంటాయి.

బాల్యస్మృతి కథీకరణే 'పరిగె చేను'

పరిగె చేను, కథకులు– ఎలికట్టె శంకరరావు, పేజీలు: 110/–, వెల: 70/– , ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, హైదరాబాద్, విశాలాంధ్ర బుక్ హౌస్ అన్నీ బ్రాంచీల్లో.

ఈ కథాసంపుటిని తన తల్లికి ఎలికట్టె శంకరరావు అంకితం చేశారు. ఈ సంకలనంలో మొత్తం పాతిక కథలున్నాయి. ఎలికట్టె శంకరరావు కథకుడు, రచయిత, బహు గ్రంథకర్త– భీమిరెడ్డి నరసింహారెడ్డి అనుభవాలు, చాకలి ఐలమ్మ జీవితం, నల్గొండ జిల్లా జల సాధన సమరం, నల్లగొండ కథలు "ప్రతిజ్ఞ పదశిల్పి పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవితం, తొలి తరం కథకుడు, కాంచనపల్లి చిన్న వెంకట రామారావు కథలు, తెలంగాణ రాష్ట్రం చరిత్ర ఉద్యమాల పేరుతో రాసి తన వంతు కృషి చేస్తున్నాడు. తెలంగాణ చరిత్ర వెలికి తీసి అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ కథల్లో అచ్చు తెలుగు పదాలు ప్రతి పంక్తిలో కనిపిస్తాయి. గుడిపూడి సుబ్బారావు 'బాల్య స్మృతి ఓ మధురానుభూతి' అంటూ ముందుమాట రాశారు. "మా నాయిన తృప్తి, నా రొట్టెల దొంగ, మా రొండో కిష్టుడి బాధ! పంట్లమ్మోల పప్పు దోసకాయలు, మా నాయిన కిలకిల నవ్వు! తింటిందుకే బతికేది"! లాంటి కథలు పాఠకుల్ని ఏకబిగువున చదివిస్తాయి. కంట నీరు పెట్టిస్తాయి. "కిష్టల మునిగిన రావన కాస్టమే!" కథ అన్ని పేద కుటుంబాల్లో లాంటిదే! అత్తవారింటి బాధలు పడి పుట్టింటికి వచ్చిన కూతుర్ని ఆమె తండ్రి మళ్ళీ అత్తారింటికి వెళ్ళాలని శాసిస్తాడు. అక్క బాధలు చూడలేని తమ్ముని మానసిక బాధ విశ్లేషణే ఈ కథాంశం. పాఠశాల విద్యార్థుల నాటకంలోని సంగతులు "జింక డ్రామాలో మా యాక్సన్ కథ" (పేజీ 82) పాలకుల వైఫల్యాల వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతు ప్రకృతి–సర్కార్–సంసారం – మధ్య ఎలా ఇబ్బందులు పడుతూ దైన్యాన్ని ఆశ, నిరాశలను స్వయంగా అనుభవించిన రైతు బిడ్డ కథాకథనమే పరిగె చేను కథలు. తెలంగాణ భాషా మాండలికాల్ని, రైతు బాధల్ని శక్తి వంతంగా శంకర్‌రావు అక్షరీకరించారు. ప్రతి కథలో సన్నివేశాలు బాల్య దశకు పాఠకుల్ని తీసుకెళ్ళి నవ్వించడమే కాదు.. కన్నీళ్ళు తెప్పిస్తాయి. సుబ్బారావు గారు అన్నట్టుగా రైతు ఇబ్బందులేవో తెలుసుకోవాలనే ఇచ్ఛ ఉంటే గనుక ఈ కథల్ని నాన్‌స్టాప్‌గా చదవాల్సిందే!

తంగిరాల చక్రవర్తి

విభిన్న మనస్తత్వాల 'వెదురు పువ్వు'

కేతు విశ్వనాథ రెడ్డి చక్కటి ముందుమాట రాసి కథల్ని ఆసాంతం పరిచయం చేశారు. కొన్ని కథల్లో ఆధునికానంతర వాద ఛాయలున్నాయి. 16 కథల్లో "వొక మైనారిటీ కథ– సద్గతి", "అమ్మ అంటే యేమిటి మమ్మీ" చాలా బాగున్నాయి. 'సద్గతి' కథలో బహదూర్ మృతి హిందూ, ముస్లిం, క్రైస్తవ, జైన సముదాయాలకు ప్రశ్నార్థకమైంది. మెడికల్ కాలేజీకి ఇవ్వడం చట్టబద్ధ చర్యకు సద్గతి ప్రాప్తించినట్లు ప్రజలు భావించడం బాగుంది. శవ సంస్కార విభేదాలు, కుల మత ఆచారాన్ని సెక్యులర్ దృక్పథం ఎదుర్కోగలదు అనే సందేశం బాగుంది. కేతు విశ్వనాథరెడ్డి గారు అన్నట్లుగా తన జీవితానుభవ పరిధిని రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ సాహిత్య అధ్యయనాన్ని నరేంద్ర (రచయిత) పెంచుకుంటూ పోతున్నారు. అనడానికి ఈ కథలే సాక్ష్యం. వీరి కథల్లో ప్రకృతి, పరిసరాలు, సమాజం, దామలో చెరువు, పాకాల,

వెదురు పువ్వు, రచన: మధురాంతకం నరేంద్ర వెల: 140/–, పేజీలు: 206/–, ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, బండ్లగూడ, హైదరాబాద్, విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలన్నింటిలో..

తిరుపతి, పాపికొండలు, మేఘాలయ, చిరపుంజి, గంగ, బ్రహ్మపుత్ర నదీ పరీహవాక ప్రాంతాల దాకా వర్ణన బాగుంది. "గాలిపాట"లో కాళిదాసు పాత్ర ద్వారా ఓ విలక్షణ సంగీత నాటక ప్రియుణ్ని ఆవిష్కరించిన తీరును పరిశీలించినప్పుడు కథకునిలో భావకుడు కనిపిస్తాడు. పాత్రల ప్రవర్తనల్లోని వైరుధ్యాలను, మార్పులను, ఘర్షణలను, భిన్నాభిప్రాయాల్ని చక్కగా ఆవిష్కరిస్తారు. చివరి ఇల్లు, పచ్చల శంఖం, చిటికెడు చక్కెర, నేను – మొలకెత్తిన నేల, పరమ పదసోపానం, చతుర్భుజం, వెదురు పువ్వు, రెండు రాగాలు, ఒక పాట, యుద్ధకాండ, రేపటి చరిత్ర, రాంషాగారింట్లో రాణి, మళ్ళా యెప్పుడో, మళ్ళా ఎక్కడో కథలు ఈ సంపుటిలో ఉన్నాయి. ఈ కథలన్నీ వివిధ, పత్రికల్లో ప్రచురణై పాఠకాదరణ పొందినవే. ఓ చక్కటి విశిష్ట కథా సంకలనం ఇది. వాసిరెడ్డి నవీన్ అన్నట్టుగా కథా రచనలో నరేంద్ర సాధించిన పరిణితికి నిదర్శనం ఈ కథలు.

-ప్రసన్నకుమారి

కోళ్లకు హోలీ

కనెక్టికట్‌లోని గుయిల్‌ఫోర్డ్‌లో గోజ్జి టర్కీ ఫామ్ ఉంది. మామూలు రోజుల్లో మిగతా టర్కీ కోళ్ల ఫామ్‌లానే ఉంటుంది కానీ నవంబర్ వచ్చిందంటే అక్కడ కోళ్లకు హోలీ జరుపుతారు. వివిధ రంగుల్లో వాటిని అందంగా ముస్తాబు చేసి ఆ కుటుంబం ప్రదర్శనకు ఉంచుతుంది. ఈ తంతు ఇప్పటిది కాదు. 1940ల నుంచే మొదలైంది.ఇందుకు విషపూరితం కానీ రంగులను మాత్రమే వాడతారు. గోజ్జి మూడోతరం ప్రస్తుతం ఫామ్ బాధ్యతల్ని చూస్తోంది. మొదట్లో వారి కుటుంబంలోని ఓ బామ్మ చుట్టు పక్కల పిల్లల్లో ఖుషీ నింపడం కోసం ఈ కలరింగ్ ఇచ్చింది. తర్వాత ఈ విషయం అంతటా ప్రచారమై దూర ప్రాంతాల నుంచి కూడా సందర్శకులు వాలిపోతున్నారు. ★

నేటి నవతరం కల నాజూకుతనం!

నాణ్యమైన పరికరాల లభ్యతకు
జైన్ కంపెనీ పేరెన్నిక గలది!
అందుకే నవ ఉత్పాదన
జైన్ టర్బోస్లిమ్!

Jain Turbo

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

చిన్న ఆలోచనలు విప్లవాత్మక సత్ఫలితాలు

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, గాంధీనగర్, హైదరాబాద్ - 80,ఫోన్ : 040-2761 4474, 24654681, 9440797846.
Email : jainhyderabad@jains.com, Website : www.jains.com

బుల్లి పెంగ్విన్లకు బుజ్జి చలిబన్నీలు

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో ...పొడవాటి ముక్కు, పొట్టి రెక్కలతో వింతగా నడిచే పెంగ్విన్లు సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఇక్కడి ఫిలిప్ ఐల్యాండ్ అయితే చెప్పేదే లేదు. ఈ బుల్లి పెంగ్విన్లు బుజ్జి చలిబన్నీలు తొడుక్కుని ఎంచక్కా నేస్తాలతో సంచరిస్తూ సందర్శకులను ఆశ్చర్యానందాలలో ఓలలాడిస్తుంటాయి. నిజానికి మనలా చలి పులి నుంచి కాపాడ్డానికి వీటికి స్వెటర్లు తొడగలేదు. చమురుతో కలుషితమౌతున్న సముద్రజలాల ప్రమాదం నుంచి వీటిని బైట పడవేసేందుకే ఈ ఏర్పాటు. చమురు పేరుకుపోయిన సముద్రపు నీరు తమను తాకినప్పుడు వాటిని నాలుకతో శుభ్రం చేసుకోవడం ఈ చిన్నిప్రాణులకు అలవాటు. ఆ అలవాటే ఇప్పుడు వీటి ప్రాణాలు తీస్తోంది. అయితే 109 ఏళ్ల ఆల్ఫీ తాతగారి అభిరుచి పెంగ్విన్లను కాలుష్య రక్కసి నుంచి కాపాడుతోంది. 'ఆల్ఫీ'కి స్వెటర్లు అల్లడమంటే సరదా. విసుగూ విరామం లేకుండా బుల్లిబుల్లి చలిబన్నీలు అల్లి వీటికోసం పంపిస్తుంటాడు. ఫిలిప్ ఐల్యాండ్ ఫౌండేషన్ వారు వాటిని పెంగ్విన్లకు స్వెటర్లను తగిలిస్తుంటారు.

ఆల్ఫీ